ప్రజా కలం

Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 29-10- 2026 | సంపుటి: 17, సంచిక: 208, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

రాజధానిలో తాగు నీటి సమస్య

రాకూడదు

క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి

భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి

తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 28 (ప్రజాకలం) :

రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్ తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్, మైట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా

తరువాయి 2వ పేజీలో...

ఓటు నమోదుకు

కటాఫ్ డేట్ పెట్టొద్దు

ఈసీకి కోర్టు ఆదేశం

తొలగించిన 47 లక్షల ఓటర్ల జాబితాను ప్రచురించండి

ఈసీకి జస్టిస్ బాగ్చి సూచన..

విచారణ రెండు వారాలకు వాయిదా



న్యూఢిల్లీ, అక్టోబరు 28: కొత్త ఓట్ల నమోదుకు ఉద్దేశించిన ఫామ్-6లో ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎలాంటి సవరణలూ చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓటరుగా జాబితాలో ఫలానా పేరు చేర్చడంపై అభ్యంతరం చెప్పడానికి నింపే ఫామ్-7, ఇప్పుడున్న చోట నుంచి వేరే చోటకు ఓటు మార్చుకోవడానికి దరఖాస్తు చేసే ఫామ్-8లను కూడా సవరించడం కుదరదని, నిర్దిష్ట ఫార్మాట్‌లో ఉన్న ఈ మూడు పత్రాలను మార్చరాదని తేల్చిచెప్పింది. ఢిల్లీలో సర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈసీకి పలు ప్రశ్నలు సంధించింది.

తరువాయి 2వ పేజీలో...



ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- యాసంగిలో వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు
- ప్రభుత్వ విప్ విజయరమణారావు
- తాగునీటికి ఢోకా లేకుండా ముందస్తు ప్రణాళికలు

పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

రైతుల సంక్షేమమే ధ్యేయంగా సూపర్ ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్షడీసీపీ రాంరెడ్డిలతో కలిని వర్షాభావ పరిస్థితులు, తాగునీరు,వ్యవసాయం,విద్యుత్ సరఫరా,ధాన్యం కొనుగోళ్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేకపోవడం,భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్న నేపథ్యంలో రానున్న యాసంగిలో వరి సాగును నివారించి తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు,నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న ఏడాది పాటు జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని,ప్రజలు నీటిని పొదుపుగా వాడుకునేలా చైతన్యపరచాలన్నారు. విద్యుత్ ఆదా కోసం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ప్రజాప్రతినిధులు ముందుగా తమ ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

తరువాయి 2వ పేజీలో...

పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట

ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం

లక్షలాది నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

ఆర్సీ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో యువతకు అండగా పీఎస్ఆర్ యువ నేస్తం

ఏడాది పాటు ఉచిత శిక్షణ.. అవసరమైతే గడువు పొడిగింపు

గతంలో 2,300 మందికి శిక్షణ.. 462 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 28 (ప్రజాకలం) :

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఆన్‌లైన్‌లో ఎన్ని లక్షల మందికైనా ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రతిష్ఠాత్మక ఆర్సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈరోజు నుంచి ఏడాది పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందని అవసరమైతే ఈ శిక్షణా కాలాన్ని పొడిగిస్తామని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

కరువుపై ముందస్తు కార్యాచరణ

కేంద్రానికి నివేదిక.. అవసరమైతే అఖిలపక్షంతో ఢిల్లీకి

తాగు, సాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

అఖిలపక్ష నేతల సూచనలతో ముందుకు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబరు 28 (ప్రజా కలం): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని కోరుతామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై బుధవారం సచివాలయంలో భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, రైతులకు అండగా నిలిచే చర్యలపై వివిధ రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నోడల్ అధికారి రామకృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

అన్ని పార్టీల సూచనలు పరిగణనలోకి..

అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ తరపున అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ తరపున వినోద్ కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ తరపున శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం తరపున అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ, సీపీఎం, తెలంగాణ జనసమితి, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తెలుగుదేశం పార్టీ తదితర పార్టీల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని తమ సూచనలు అందించారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు,

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణను ఎడారిగా మార్చేందుకు

కాంగ్రెస్ కుట్ర

మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్.. కోరుకంటి చందర్

3

కలం కౌంటర్



విద్వేషాన్ని వ్యాప్తి చేయకండి

- రాహుల్ గాంధీపై నిర్మలా సీతారామన్ ఆగ్రహం



న్యూఢిల్లీ : టాటా గ్రూప్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా స్పందించారు. విద్వేషాన్ని వ్యాప్తి చేయొద్దని రాహుల్ గాంధీకి హితవు పలికారు. టాటా సంస్థకు సంబంధించిన వివాదంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. టాటా గ్రూప్‌లో చోటుచేసుకున్న పరిణామాలపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించాలని, భారతీయ వ్యాపార సంస్థలు రాజకీయ నాయకుల చేతుల్లో ఆటవస్తువులుగా మారకూడదని వ్యాఖ్యానించారు. 'టాటా గ్రూప్‌ను ఉద్దేశపూర్వకంగా నాశనం చేస్తున్నారు. భారత వ్యాపారం మోదీ, షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు. మాకు ఉంది. మేము న్యాయం జరిగేలా చూస్తాము' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు. రాజకీయ విమర్శలు చేసే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. టాటా గ్రూప్‌నకు చెందిన టాటా సన్స్ సంస్థలో నాయకత్వానికి సంబంధించిన అంశాలు చర్చకు దారితీశాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామక ప్రక్రియపై టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సంస్థ పాలన, నిర్ణయాల ప్రక్రియపై చర్చ మొదలైంది. ఈ వివాదాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. రాహుల్ విమర్శలను నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు.

గాలి, నీరూ విషతుల్యమే!

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ప్రజలకు అనారోగ్య సమస్యలు

యార్డు తరలింపు కోరుతూ ఈటల పాదయాత్ర

ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలి.. ప్రభుత్వంపై ఎంపీ విమర్శలు



ఘట్‌కేసర్, అక్టోబరు 28 (ప్రజా కలం): గాలి పీల్చేది, నీరు తాగేది బతకడానికే తప్ప చావడానికి కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల్లో గాలి, నీరు కలుషితమవుతున్నాయని విమర్శించారు. డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన పాదయాత్ర రెండో రోజు ఘట్‌కేసర్ మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. బీసీ సంఘాల నాయకులు, భాజపా నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి ముప్పు

ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి పీల్చడం, స్వచ్ఛమైన నీరు తాగడం ప్రజల హక్కు అని పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు

మొదటి పేజీ తరువాయి...

చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్క్ లు, రోడ్ల శుభ్రత కు కూడా ట్రీటెడ్ వాటర్ నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీవీఎస్పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిరవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువుపై ముందస్తు కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి...

రైతులకు సహాయం, తాగు-సాగునీటి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై అభిప్రాయాలను వెల్లడించారు.

రాజకీయాలకు అతీతంగా సహకరించాలి

వివత్త పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేతలు ప్రస్తావించిన అంశాలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు ప్రభుత్వ కార్యాచరణలో వాటిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలోనూ చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపినట్లు వివరించారు. పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ప్రభుత్వం ఉందన్నారు.

జలవనరులపై ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడితే జలవనరులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని భట్టి తెలిపారు. రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

పశువులకు నీరు, మేత

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో పాటు పశువులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని భట్టి విక్రమార్క చెప్పారు. పశువులకు అవసరమైన మేత లభ్యతపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన బడ్జెట్, ఇతర ఏర్పాట్లను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

కేంద్ర సాయం కోరుతాం

కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో చర్యలు చేపడుతూనే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా వినియోగించుకుంటుందని భట్టి స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక పంపించామని, అవసరమైన సహాయం కోసం ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి కేంద్రాన్ని సంప్రదించి రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని కోరుతామని చెప్పారు. గతంలో కరోనా వంటి సంక్షోభాలను ఎదుర్కొన్నప్పుడు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేశాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచుతూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి రాష్ట్రాన్ని కరువు ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి...

ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలన్నారు.ప్రభుత్వ విప్ విజయ రమణారావు మాట్లాడుతూ బోరుబావుల కింద వరికి బదులు మొక్కజొన్న,శనగ వంటి తక్కువ నీటి పంటలను సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ మార్గనిర్దేశం చేయాలని,రైతులు వ్యర్థాలను కాల్చవద్దని సూచించారు.కలెక్టర్ కోయ శ్రీహర్ష వర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ..జిల్లాలో సాధారణ వర్షపాతంలో 8 శాతం లోటు ఉందని,అక్టోబర్‌లో ఒక్క మిల్లీమీటరు వర్షం కూడా నమోదు కాలేదని తెలిపారు.భూగర్భ జలాలు సగటున 5.31 మీటర్లకు పడిపోయినందున యాసంగిలో సుమారు 90 వేల ఎకరాలు బీడుగా ఉండే అవకాశముందని,ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.ఎల్లంపల్లిలో 17.62 టీఎంసీల నీరు నిల్వ ఉన్నందున 285 రోజుల పాటు తాగునీటికి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు.నవంబర్ రెండో వారం నుంచి 311 కేంద్రాల ద్వారా 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ అవసరమైతే డెడ్ స్టోరేజీ నుంచి కూడా తాగునీటిని తరలించేలా వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వానకాలం వరి మద్దతు ధర,సన్న రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లింపు,సీతమ్మలోది ట్రెక్కింగ్ పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్,రామగుండం మేయర్ మహంకాళి స్వామి,మున్సిపల్,మార్కెట్ కమిటీ చైర్మన్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట

ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు నందర్భంగా బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అండగా నిలవడమే లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

గత 30 ఏళ్లుగా ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. ఈ సంస్థలో కరీం, కృష్ణారెడ్డి, మేముల సైదులు వంటి అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యులు ఈ శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉండటం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు.

గత అనుభవమే 'యువ నేస్తం'కు స్ఫూర్తి

2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి, 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రిగారు గుర్తుచేశారు. అప్పట్లో సుమారు 2,300 మంది నిరుద్యోగులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ఆ శిక్షణ పొందిన వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు తనను ఎంతగానో కదిలించాయని, వారి ఆనందాన్ని చూసి తన కళ్లలో నీళ్లు తిరిగాయని మంత్రి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆ అనుభవమే మరింతమంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించాలనే సంకల్పానికి ప్రేరణగా నిలిచిందన్నారు. గతంలో ఒక ప్రాంతానికి పరిమితమైన శిక్షణను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

ఇంటి వద్ద నుంచే నాణ్యమైన శిక్షణ

ప్రస్తుత ఆన్‌లైన్ శిక్షణ విధానం వల్ల అభ్యర్థులు హైదరాబాద్ కు రాకుండానే తమ ఇళ్ల వద్ద నుంచే శిక్షణ పొందవచ్చని మంత్రి తెలిపారు. దూర ప్రాంతాల్లో నివసించే యువతకు ప్రయాణ ఖర్చులు, వసతి తదితర ఇబ్బందులు లేకుండా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. నాణ్యమైన శిక్షణ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఒక్కో అభ్యర్థికి ఇలాంటి శిక్షణ అందించేందుకు సాధారణంగా కనీసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణా సామగ్రి కోసమే సుమారు రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఖర్చులన్నింటినీ ట్రస్ట్ భరిస్తుందని, అభ్యర్థులకు శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు.

లక్ష మందికి పైగా నమోదు.. ఎంతమందికైనా శిక్షణ

'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమంపై తొలుత కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, ఉచిత శిక్షణ నిజంగానే అందిస్తున్నట్లు తెలుసుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో యువత పేర్లు నమోదు చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రకటన విడుదల చేసిన పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం ఈ కార్యక్రమంపై యువత చూపుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి కటాఫ్ తేదీ విధించలేదని, లక్ష మందితోనే పరిమితం కాకుండా ఎంతమంది అభ్యర్థులు ముందుకొచ్చినా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది వరకు ఏడాది పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని, అవసరమైతే శిక్షణా కాలాన్ని మరింత పొడిగిస్తామని తెలిపారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతీ యువకులందరికీ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

త్వరలో మరో 15 వేల ఉద్యోగాల భర్తీ

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి గారు తెలిపారు. ఇప్పటికే రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో సుమారు మరో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్న మంత్రి.. ఆ దిశగా 'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితులు, శిక్షణ ఖర్చులు, దూరప్రాంతాల సమస్యలు యువత లక్ష్యసాధనకు అడ్డంకులు కాకూడదనే ఉద్దేశంతోనే ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న ప్రతి నిరుద్యోగ యువతీ యువకుడికి ఈ కార్యక్రమం ఒక అవకాశంగా నిలవాలని, యువత తమ ప్రతిభను నిరూపించుకొని ఉద్యోగాలు సాధించేలా ఈ వేదిక తోడ్పడాలని మంత్రి ఆకాంక్షించారు.

దీపావళి లోగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈరోజు కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రానున్న దీపావళి లోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సమ్మతించారని తెలిపారు. దీనివలన దీర్ఘకాలిక సమస్య తీరుతుందన్నారు. దీనిపై పాత్రికేయుల స్పందిస్తూ మంత్రిగారి పుట్టినరోజున తమకు శుభవార్త వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

ఓటు నమోదుకు కటాఫ్ డేట్ పెట్టొద్దు

మొదటి పేజీ తరువాయి...

'ఫామ్-6 కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించింది. కానీ ఎన్యుమరేషన్ పత్రాలు సమర్పించని కారణంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినవారిని.. మళ్లీ ఫామ్-6 నింపాలని ఎందుకు అడుగుతున్నారు? ఢిల్లీలో సమీప భవిష్యత్‌లో ఏ ఎన్నికలూ లేవు కదా! పేర్ల రీ-ఎన్‌రోల్‌మెంట్‌కు ఈ నెల 30 వరకు గడువు విధించడమెందుకు? ఎలాంటి కటాఫ్ డేట్ పెట్టొద్దు' అని ఈసీని ఆదేశించింది. పూర్వపు ఓటర్ల జాబితాలో పేరుండి ఇప్పుడు లేనివారి కోసం.. మళ్లీ కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడం కాకుండా.. వేరే ప్రత్యామ్నాయ పరిష్కారం కనుగొనాలని హితవు పలికింది. ధర్మాసనం లేవనెత్తిన అంశాలను కమిషన్ చర్చిస్తుందని.. దిద్దుబాటు చర్యలు చేపడుతుందని కమిషన్ తరఫు సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు తెలిపారు. పిటిషనర్ల తరఫున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ..ఢిల్లీలో 'సర్' ప్రక్రియను మొదలుపెట్టినప్పుడు మొత్తం ఓటర్లు 1.45 కోట్ల మంది ఉన్నారని, వీరిలో 97 లక్షల మంది ఎన్యుమరేషన్ పత్రాలను ఈసీకి సమర్పించారని.. 47 లక్షల మంది నుంచి అందలేదని వివరించారు.

ఓటుహక్కు కీలక హక్కు..

'ఓటు హక్కు చాలా కీలకమైన హక్కు ఎన్యుమరేషన్ పత్రం సమర్పించనంత మాత్రాన ఆ హక్కును ఎప్పటికీ కోల్పోవలసిందేనా' అని జస్టిస్ బాగ్చీ ప్రశ్నించారు.

47లక్షల గ్యాప్‌ను తగ్గించడానికి కమిషన్ ప్రయత్నించాలని.. వారి పేర్లతో జాబితాను ప్రచురించి.. వారి ఆచూకీ తెలియడం లేదని.. వారే సమీపంలోని బీఎల్‌వోలను సంప్రదించి.. ఫామ్-8 నింపాల్సిందిగా అందులో పేర్కొనాలని సూచించారు. ఫామ్-6, ఫామ్-8లను ఎప్పుడైనా తీసుకుంటామని వారికి తెలియజేయాలని సీజేఐ అన్నారు. తదుపరి విచారణను ధర్మాసనం 2వారాలు వాయిదావేసింది.

వాళ్లకు ఎన్నికలు నిర్వహించిన అనుభవం లేదు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ, వివేక్ జోషిల నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ కొత్త మలుపు తిరిగింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా సంపాదించిన వివరాలను పిటిషనర్ తాజాగా న్యాయస్థానం ముందుంచారు.

అభ్యర్థులకు ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఉందా లేదా, వారి నిజాయతీ (ఇంటెగ్రిటీ) ఎలాంటిదనే అంశాలను ఎంపిక కమిటీలు పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికే దాఖలు చేసిన తన రిట్ పిటిషన్‌ను సవరించేందుకు అనుమతించాలంటూ పిటిషనర్ నూరి వయాల.. అదనపు దరఖాస్తును సమర్పించారు.

గాలి, నీరూ విషతుల్యమే!

మొదటి పేజీ తరువాయి...

డంపింగ్ యార్డు నుంచి వెలువడే వ్యర్థాల కారణంగా గాలి కలుషితమవుతోందని, చెత్త నుంచి వెలువడే లీచేట్ నీటి వనరుల్లో కలవడంతో తాగునీరు కలుషితమవుతోందని ఆరోపించారు. కలుషిత నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతేనని, ప్రజల జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ వ్యవహారాలు, కోర్టు తీర్పుల అమలులో నెలకొన్న పరిస్థితుల వల్ల సమస్య పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల జీవితాలతో చెలగాటమాడవద్దని హితవు పలికారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

డంపింగ్ యార్డు సమస్యపై న్యాయ స్థానాలు తీర్పులు ఇచ్చాయని, నిపుణులు పరిష్కార మార్గాలను సూచిస్తున్నారని ఈటల తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. నిధుల కొరతతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని, ప్రభుత్వ పనితీరు దారుణంగా ఉందని విమర్శించారు.

వ్యర్థాలతో ఇబ్బందులు

ప్రాంతంలోని కొన్ని పరిశ్రమలు వ్యర్థాలను వాగుల్లోకి వదులుతున్నాయని స్థానికులు ఆరోపించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే మురుగు, ఇతర వ్యర్థాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఈటల రాజేందర్‌కు తమ సమస్యలను వివరించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

హైదరాబాద్, అక్టోబరు 28 : ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలని సూచించారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన జలసిరి వీడియోను మంత్రి సీతక్క బుధవారం ఆవిష్కరించారు. అలాగే, గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా రీఅపాయింట్ అయిన దాన కిషోర్‌ను అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12,516 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. మిగిలిన 244 గ్రామ పంచాయతీల్లో వెంటనే పనులు ప్రారంభించాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబరు 27వ తేదీన ఉపాధి పనులకు 3,97,788 మంది కూలీలు హాజరు కావడం రికార్డు అని తెలిపారు. ఇంకా కూలీల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వివరించారు.



పశువులకు మేత, తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి..

ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించాలని మంత్రి సీతక్క సూచించారు. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులను చేపట్టాలని సూచించారు. పశువులకు మేత, తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మార్గనిర్దేశం చేశారు. సర్పంచులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్‌నినోను ఎదుర్కోవాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి కూలీలను మొబిలైజ్ చేయాలని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పించేందుకు బడ్జెట్ ఉందని వెల్లడించారు. ఆ బడ్జెట్ ద్వారా మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో వెనుకబడ్డ సర్పంచులు కార్యదర్శులు మండల అధికారుల మీద చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కూలీలకు పనులు కల్పించాలి..

గ్రామాల అభివృద్ధి పనులు ఫుల్లుగా నమోదు అవుతున్నాయని మంత్రి సీతక్క వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో కోటి 12 లక్షల రికార్డులను నమోదు చేశామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర వివరాలు అందులో పొందుపరిచామని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ పీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కూలీలకు పనులు కల్పించాలి, చెక్ డ్యామ్‌లను నిర్మించాలని సూచించారు. అక్కడి భౌగోళిక జీవన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పనులను కల్పించాలని ఆదేశించారు. వలసలను నివారించే లక్ష్యంగా ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రజలకు.. ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కోగలమనే భరోసా కల్పించాలని అన్నారు. ఉక్కు మహిళా ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19వ తేదీన గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభిస్తామని.. అప్పటిలోగా ఆయా పనులు పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే

ఏఐ వినియోగ లక్ష్యం: భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబరు 28 : ఏఐతో ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యమని పేర్కొన్నారు. 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో భట్టి విక్రమార్క బుధవారం పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయాన్ని ప్రజలకు కేటాయించాలని సూచించారు.

కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి..

రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యం పెంపొందించేందుకే 'ఏఐ సాక్షమ్'ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాధనం వినియోగం, ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణకు ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. నంక్షేమ వధకాలు అర్హులందరికీ చేరుతున్నాయో, లేదో గుర్తించవచ్చని చెప్పుకొచ్చారు. విద్యుత్ డిమాండ్ అంచనా, పరికరాల లోపాల గుర్తింపులో ఏఐ కీలకంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు.

ఏఐతో సమయం ఆదా..

ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీలో ఏఐతో సమయం ఆదా అవుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఏఐ ఇచ్చే సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. ఏఐ వినియోగంలో తప్పులకు బాధ్యత వహించే వ్యక్తి ఎవరో స్పష్టత ఉండాలని అన్నారు. చిన్నస్థాయి ప్రయోగాల తర్వాతే ఏఐ వ్యవస్థల విస్తరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలే ఏఐ విజయానికి కొలమానమని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 28 ప్రజాకలం:- జగిత్యాల జిల్లా మెట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీమతి శారద, వెంకటగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పాడైపోయిన మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, బ్యాటరీలు, కంప్యూటర్ పరికరాలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, నిబంధనల ప్రకారం పారవేయాలని విద్యార్థులకు వివరించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నలుపు రంగు చెత్త డబ్బాలో వేయాలనే విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ-వేస్ట్‌ను నిర్లక్ష్యంగా పారవేయడం వల్ల పర్యావరణానికి, నేల, నీరు, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగావ్యవహరించాలని, ఇళ్లలో ఉత్పత్తయ్యే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను కూడా సరైన విధానంలో నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రక్తదానం ప్రాణదానంతో సమానమని,ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జైపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.?ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం ఎంతో అవసరమని,దాతలు అందించే రక్తం ఎందరో ప్రాణాలను నిలబెడుతుందని పేర్కొన్నారు. రక్తదానం సమాజానికి మేలు చేసే అత్యున్నత సేవా కార్యక్రమమని,దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఆరోగ్యంగా ఉండి,అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తదానం చేసి బాధితులకు అండగా నిలవాలని కోరారు.శిబిరంలో రక్తదానం చేసిన జైపూర్ ఎస్ఐ భూమేష్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామ సర్పంచ్,యువకులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు,సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్,ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది,స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుల ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్

పార్టీ ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 28 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖుతూబోద్దిన్ పాషా జన్మదిన వేడుకలను బుధవారం ఆయన చిన్ననాటి మిత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను పాషా చేత కట్ చేయించి, మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అలీం, సాజిద్, ముస్తాక్, రఫీఉల్లా, షేక్ హాజీ, రిజ్వాన్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఐజేయూ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఘన సన్మానం

మల్లాపూర్, అక్టోబర్ 28 (ప్రజా కలం ప్రతినిధి): మల్లాపూర్ మండల నూతన ఐజేయూ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను చిట్టాపూర్ గ్రామంలో ఫ్యాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్ రెడ్డి, సర్పంచ్ సంపతి శంకరమ్మ-ఆశన్న, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమస్యల పరిష్కారానికి పాత్రికేయులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ కుట్ర

మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్.. కోరుకంటి చందర్

మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కి.మీ మహా సైకిల్ యాత్ర ప్రారంభం



పెద్దపల్లి,అక్టోబర్ 28:
(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ,కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నీటిని లిఫ్ట్ చేయకుండా తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కుట్ర పన్నుతోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాళేశ్వరం ప్రాజెక్టును పరిరక్షించి,రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు పెద్దపల్లి,మంథని, రామగుండం నియోజకవర్గాల యువకులు చేపట్టిన 400 కిలోమీటర్ల మహా సైకిల్ యాత్రను పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దాసరి మమతా రెడ్డితో కలిసి వారు మేడిగడ్డ వద్ద జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ మేడిగడ్డ వద్ద సమృద్ధిగా ఉన్న నీటిని చూసైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కళ్లు తెరవాలని హితవు పలికారు.ప్రపంచంలో ఎక్కడ కరువు వచ్చినా తెలంగాణకు రాకుండా దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని కాపాడేలా ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన గొప్ప కాలజ్ఞాని మాజీ సీఎం కేసీఆర్ అని కొనియాడారు.గోదావరి నీరు దిగువకు వృథాగా పోతుంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటోందని,కానీ నదీ పరీవాహక ప్రాంత ప్రజలకు,రైతులకు నీరివ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతోనే ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు.స్థానిక నియోజకవర్గంలో 150 కిలోమీటర్ల మేర నీరు నిలిచే ఇంతటి భారీ ప్రాజెక్టు ఉన్నా,దాన్ని కాపాడేందుకు స్థానిక ఎమ్మెల్యే,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎలాంటి చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు.

నీళ్ల దిశ మార్చిన ఘనత కేసీఆర్‌దే
రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

తెలంగాణ ప్రాంతంలో కరువు ఉండకూడదని,సహజసిద్ధంగా తూర్పు దిశగా వెళ్లే గోదావరి నీటిని పడమర వైపు మళ్లించి తెలంగాణ దశ-దిశ మార్చిన అపర భగీరథుడు కేసీఆర్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రశంసించారు.2023 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేశారని,ఆ అబద్ధాన్ని నిజం చేయడానికే మూడేళ్లుగా నీటిని ఎత్తిపోయకుండా ప్రాజెక్టును ఎండబెడుతూ రాష్ట్రాన్ని కరువు పాలు చేస్తున్నారని విమర్శించారు.కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గతంలో 180 కిలోమీటర్లు పాదయాత్ర చేసినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదని గుర్తుచేశారు.

అధికారం లోకి వచ్చి మూడేళ్లయినా కనీసం బ్యారేజీ పిల్లర్లను మరమ్మతు చేయలేని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఏం అభి వృద్ధి చేస్తారని నిలదీశారు.నీళ్ల కోసం తెలంగాణలో మరో ఉద్యమం మొదలై దని,రైతుల గోస పట్టించుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

యువ నాయకులు బొడ్డు రవీందర్,ఉప్పు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ మహా సైకిల్ యాత్రలో మేకల నవీన్,పారుపల్లి అనిల్,ముత్యం లక్ష్మణ్ గౌడ్,గుండబోయిన శ్రీనివాస్, సతీష్,సర్వేష్,కాశీపాక వాసు,పల్లె మధు తదితర యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు.

ఇంటి ఆవరణలోనే గంజాయి సాగు

- గుట్టురట్టు చేసిన ఎక్సైజ్ అధికారులు.. రిమాండ్‌కు నిందితుడు



పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామంలో గంజాయి సాగు కలకలం రేపింది.గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలు పెంచుతున్నారన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం ఉదయం ఆకస్మిక దాడులు నిర్వహించారు.డిప్యూటీ కమిషనర్ రవికుమార్,జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏఈఎస్ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో నిందితుడి వద్ద నుంచి ఎనిమిది ఎండిన గంజాయి మొక్కలతో పాటు పచ్చి గంజాయి మొక్కలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం గంజాయి సాగుకు పాల్పడుతున్న బొల్లి చరణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని,రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి సాగు చేసినా,విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు,సాగుకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ సీఐలు,ఎస్సైలు,టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి - అమరవీరుల సంస్మరణార్థం పోలీసుల సైకిల్ ర్యాలీ



సుల్తానాబాద్,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజల రక్షణ కోసం నిత్యం శ్రమిస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్,జూలపల్లి,ఎలిగేడు,పొత్కపల్లి,కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని స్థానిక తెలంగాణ చౌరస్తా వద్ద డీసీపీ బి.రామ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. విధి నిర్వహణలో నిబ్బంది అసువులు బాయడం అత్యంత బాధాకరమని, అమరులైన పోలీసు కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ సైకిల్ ర్యాలీ తెలంగాణ చౌరస్తా నుంచి ప్రారంభమై తహసీల్దార్ కార్యాలయం,సివిల్ ఆసుపత్రి,శివాలయం, పాత జెండా,పోలీస్ స్టేషన్, రాజీవ్ రహదారి మీదుగా పూసాల ఎక్స్ రోడ్డు,వివేకానంద స్కూల్ వరకు సాగింది.అనంతరం తిరిగి తెలంగాణ చౌరస్తా వద్దకు చేరుకోవడంతో ర్యాలీ ముగిసింది.ఈ కార్యక్రమంలో ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్,గట్ల సుధాకర్, సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు,మండల పాత్రికేయులు క్రీడాకారులు,విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలి

- అవగాహన పోస్టర్ విడుదల చేసిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి సరిత మట్టా



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 28(ప్రజా కలం): బాలలపై లైంగిక నేరాలను అరికట్టి, వారి హక్కులను పరిరక్షించేందుకు పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్టా సూచించారు. జగిత్యాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టం-2012పై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లలను లైంగిక దాడులు, వేధింపులు, దోపిడీ నుంచి రక్షించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని సరిత మట్టా తెలిపారు. బాలలపై జరిగే నేరాలను అరికట్టడంతోపాటు బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు ఈ చట్టం దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థినులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.బాలల రక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.అనంతరం పోక్సో చట్టంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. చంద్ర మోహన్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, న్యాయవాదులు మమత, స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో...

రక్తదానం చేసిన మేడిపల్లి యువకులు

- అభినందించిన కోరుట్ల సీఐ



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 28 (ప్రజా కలం) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మేడిపల్లి మండలానికి చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా రక్తదాన శిబిరంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న మేడిపల్లి యువకులను కోరుట్ల సీఐ తిరుపతి అభినందించారు.

గులాబీ గూడు వీడి.. హస్తం గూటికి

కాంగ్రెస్‌లో చేరిన సబ్బితం మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు
కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,కీలక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో,సబ్బితం గ్రామ మాజీ సర్పంచ్ చుంచు సదయ్య,మాజీ ఉపసర్పంచ్‌లు మదాసి శ్రీనివాస్,చుంచు చిన్న పెద్దులుతో పాటు వార్డు సభ్యులు పులిపాక మనోజ రాజయ్య,ఇంద్ల నాగతేజశ్విని-రమేష్,గుమ్మడి రాజేంద్ర ప్రసాద్,ఆకుల సతీష్ కుమార్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వీరితో పాటు మాజీ వార్డు సభ్యులు చెప్పాల రాజేశం,కాపు సంఘం అధ్యక్షులు పేరుక పోచాలు,గ్రామ నాయకులు చుంచు సారయ్య,చుంచు సంపత్ సహా పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.పార్టీలో చేరిన నాయకులకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ప్రజా సంక్షేమం,గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని,పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సబ్బితం గ్రామ సర్పంచ్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు,ఇతర ప్రజాప్రతినిధులు, మహిళలు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజా కలం
గురువారం, అక్టోబర్ 29, 2026

ఫెడరల్ ఫ్రంట్ సాధ్యమేనా?

జాతీయ రాజకీయాల్లో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయ శక్తులను ఒకే తాటిపైకి తెచ్చేందుకు భారత రాష్ట్ర సమితి అధినేత కే.చంద్రశేఖర్ రావు మళ్లీ వేగంగా పావులు కదుపుతున్నారని కేటీఆర్ సంకేతాలు ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి నియంత్రణను, దర్యాప్తు సంస్థల దూకుడును ఎదుర్కొనేందుకు ఒక పటిష్టమైన ఫెడరల్ ఫ్రంట్ లేదా రీజినల్ అలయన్స్ అవసరమనే చర్చను బీఆర్ఎస్ తిరిగి తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా ఏపీలో అధికారం కోల్పోయిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ , ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ లాంటి బలమైన ప్రాంతీయ దిగ్గజాలతో మళ్లీ టచ్‌లోకి వెళ్లేందుకు గులాబీ దళపతి గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నట్లు పొలిటికల్ సర్కిళ్లలో చర్చ సాగుతోంది.ఈ ప్రాంతీయ కూటమి ప్రయత్నంలో కేసీఆర్‌తో కలసి రావడానికి ఏ పార్టీకి ఎంతవరకు సానుకూలత ఉందనేది ఇప్పుడు ఆసక్తికరమైన అంశం. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య మొదటి నుంచి సత్సంబంధాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయాక, అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్, బీజేపీల ఉమ్మడి రాజకీయ ఒత్తిడి పెరిగిన తరుణంలో జగన్-కేసీఆర్‌లు ఒకరికొకరు మద్దతుగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లను తట్టుకోవడానికి, పార్లమెంట్ పరిధిలోనూ ప్రాంతీయ బలాన్ని ప్రదర్శించడానికి ఈ ఇద్దరు నేతలు ఒకే వేదికపైకి రావడం ఇరు పార్టీలకు రాజకీయంగా ఊరటనిచ్చే అంశం. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, ఈ థర్డ్ ఫ్రంట్ మోడల్‌కు ప్రధాన భాగస్వామిగా మారే అవకాశాలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కలస్తున్నా.. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నేతలు మమతా బెనర్జీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా లేరు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తన పెద్దన్న పాత్రను రుద్దడాన్ని దీదీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ పార్టీల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, అలాగే బెంగాల్ వేదికగా కేంద్ర ప్రభుత్వంతో సాగిస్తున్న పోరాటంలో ప్రాంతీయ మిత్రుల మద్దతు పొందేందుకు మమత-కేసీఆర్‌ల వ్యూహాలు సులువుగా సరిపోతాయి. గతంలో కూడా కేసీఆర్ కలకత్తా వెళ్లి మమతా బెనర్జీతో జరిపిన భేటీలు, ఆ తర్వాత రూపొందించిన ఫెడరల్ ఫ్రంట్ కార్యాచరణ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా కాంగ్రెస్‌పై పూర్తిగా ఆధారపడటానికి సిద్ధంగా లేరు. ఎస్పీకి ఉన్న యాదవ-ముస్లిం ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే, జాతీయ స్థాయిలో బీజేపీని ఢీకొట్టేందుకు బలమైన ప్రాంతీయ నాయకత్వాన్ని ఆయన కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించబోతున్నారంటూ కేటీఆర్ చేసిన ప్రకటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బలహీనపడుతోందని, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వైఫల్యాలు దేశంలో మరో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని తెస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేస్తూ కీలక పాత్ర పోషిస్తారన్న సంకేతాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నాయి.కొంతకాలంగా జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. కేంద్రంలో అధికార బీజేపీ సంకీర్ణ కూటమిపై ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండీ' కూటమిలో సమన్వయ లోపాలు బయటపడుతున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయం కోసం ప్రాంతీయ పార్టీలు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు కేసీఆర్ తన అనుభవం, జాతీయ రాజకీయాలపై ఉన్న పట్టును ఉపయోగించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రాంతీయ ఆత్మగౌరవ నినాదంతో ఇతర ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా తెరవెనుక కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.కేటీఆర్ చేసిన ఈ ప్రకటన వెనుక కేవలం ఢిల్లీ పీఠాన్ని ప్రభావితం చేయడమే కాదు.. తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత కొంత నైరాశ్యంలో ఉన్న కేడర్‌ను ఉత్తేజపరచడానికి ఇదొక స్ట్రాటజీ అయి ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేసీఆర్ జాతీయ స్థాయిలో మళ్లీ చక్రం తిప్పుతారనే ప్రచారం మానసిక స్థైర్యాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. అలాగే, రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే నినాదంతో శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే ప్లాన్ ఇది.అఖిలేష్ పాల్గొనడం, రైతు సమస్యలు, ఫెడరలిజంపై ఒకే విధమైన విధానాలను పంచుకోవడం వల్ల కేసీఆర్ పిలుపునిస్తే కలసి నడిచే ప్రధాన నాయకులలో అఖిలేష్ యాదవ్ ముందువరుసలో ఉంటారని భావించవచ్చు. ఒడిశాలో సుదీర్ఘకాలం పాలించి ఇటీవల ప్రతిపక్షంలోకి వచ్చిన బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ వైఖరి ఇక్కడ చాలా కీలకమైనది. గతంలో సమాన దూరం పాటించిన బీజేడీ, ఇటీవల ఒడిశాలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్డీయేతో సంబంధాలను పూర్తిగా తెంచుకుంది. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రాంతీయ నిధుల సాధన కోసం కఠిన వైఖరి అవసరమని భావిస్తున్న నవీన్ పట్నాయక్, కేంద్రానికి కౌంటర్ ఇచ్చేందుకు ఈ ప్రాంతీయ వేదికకు మద్దతిచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని అంటున్నారు. ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవడం వెనుక ఉన్న ముఖ్య ప్రణాళిక రాజకీయ రక్షణ. నిధుల పంపిణీలో కేంద్ర ప్రభుత్వ వివక్షను ప్రశ్నించడం, సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థల వాడకంపై ఉమ్మడిగా పార్లమెంట్ లోపల, బయటా నిరసనలు తెలపడం ద్వారా కేంద్రంపై తీవ్ర రాజకీయ ఒత్తిడి తెవచ్చని వీరు లెక్కలు వేస్తున్నారు. ఒకవేళ కేసీఆర్ అనుకున్నట్లుగా ఈ ప్రాంతీయ దిగ్గజాలందరినీ ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే, జాతీయ స్థాయిలో మూడో కూటమి మళ్లీ కీలకమైన శక్తిగా అవతరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా మెగా రక్తదాన శిబిరం



జగిత్యాల ప్రతినిధి
అక్టోబర్ 28 (ప్రజా కలం)

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పోలీస్ సర్కిళ్ల సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో పాటు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు యువత నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు.రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసే ప్రతి ఒక్కరినీ పోలీస్ శాఖ తరపున అభినందించారు. శిబిరం నిర్వహణలో సహకరించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, పోలీస్ అధికారులను ప్రశంసించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఎస్పీ సూచించారు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా నీటి వృథాను, విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. సహజ వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుజాత, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, ఇన్స్పెక్టర్లు సుధాకర్, కరుణాకర్, రాజ్‌కుమార్, తిరుపతి, వేణు, సైదులుతో పాటు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

హిందీ అభ్యసనానికి 'సులేఖ్ వ వాచనమాలా' పుస్తకం

- హిందీ ఉపాధ్యాయుడు ఎ. రాజేంద్ర ప్రసాద్ రచన ఆవిష్కరణ



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 28 (ప్రజకలం):- విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తినిపెంపొందించడంతో పాటు, చదవడం, రాయడం, చక్కని చేతిరాత అలవాట్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రూపొందించిన 'సులేఖ్ వ వాచనమాలా' (చక్కని చేతిరాత మరియు పఠనమాల) పుస్తకాన్ని బుధవారం మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో ఆవిష్కరించారు.ఈ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎ. రాజేంద్ర ప్రసాద్ స్వీయ రచనగా రూపొందించిన ఈ పుస్తకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. నారాయణఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె. నారాయణ మాట్లాడుతూ.. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు హిందీ భాషను సులభంగా, సరళంగా నేర్చుకునేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. హిందీ వర్ణమాల, సరళ పదాలు, ద్విత్వాక్షరాలు, చదవడం, రాయడం, చూచి రాయడం వంటి అంశాలతో పాటు చక్కని చేతిరాతను అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా రచయిత తన అనుభవంతో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభ్యసన అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ పుస్తకం హిందీ భాషపై పట్టు సాధించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం పుస్తక రచయిత ఎ. రాజేంద్ర ప్రసాద్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పుస్తక రూపకల్పనకు ఆయన చేసిన కృషిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను రూపొందించి, భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు చేసిన ప్రయత్నాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత ఎ. రాజేంద్ర ప్రసాద్,ప్రధానోపాధ్యాయుడు కె. నారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు జి. వెంకటగిరి, జి. సురేష్, ఎం. గణేష్, ఎం. రవీందర్, ఎ. మంజుల, బి. భూమ తదితర ఉపాధ్యాయులు,విధ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు-నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ



పెద్దపల్లి,అక్టోబర్28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,జిల్లా కలెక్టర్ కోయ హర్ష ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.?ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.యువత దేశ భవిష్యత్తు అని,అటువంటి యువతరం మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తులు,కుటుంబాలతో పాటు మొత్తం సమాజమే తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎర్రబాటి వెంకటేశ్వర్ రావు,వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు,స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్,జిల్లా కోశాధికారి పాంపాటి శ్రీకాంత్,నిమ్మనపల్లి సర్పంచ్ వేల్పుల రమేష్,పెద్దపల్లి పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీఎస్ మూర్తి,నాయకులు సంపత్,ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో చలో ఇంద్రవెల్లి పోస్టర్ల విడుదల

ఈనెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించే పాంచజన్య సంకల్ప సభ ను విజయవంతం చేయండి: మాజీ మంత్రి టిఆర్ఎస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బోడ జనార్ధన్



బెల్లంపల్లి, అక్టోబర్ 28, (ప్రజాకలం) ప్రతినిధి..

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈనెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించే పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని మాజీమంత్రి బోడ జనార్ధన్ పిలుపునిచ్చారు. బెల్లంపల్లి పట్టణంలో సంకల్ప సభకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈనెల 30న కవిత సభ పెడుతుంది అనడంతో బీఆర్ఎస్ పార్టీవారు మరో సభకు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమం శూన్యమని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను అదొగతి పాలు చేసిందని విమర్శించారు. సింగరేణి సంస్థకు రావలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థ ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నించారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల ధనాన్ని దోచుకుని పాలన కొనసాగించారని పేర్కొన్నారు. ఆనాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లిలో సభ నిర్వహించి ఎన్నో హామీలు ఇచ్చారని తెలిపారు. వీటిని అమలు చేయకపోవడంతో హామీ ఇచ్చిన సభ ప్రాంగణం నుండే ముఖ్యమంత్రిని ప్రశ్నించేందుకు ఈనెల 30న సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30 వేల మందితో నిర్వహించే ఈ సభకు బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తెలంగాణ రక్షణ సేన నాయకులు కార్యకర్తలు ప్రజలు కవిత అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ జాగృతి సంస్థను కల్వకుంట్ల కవిత స్థాపించినప్పటి నుండి ఆమె వెంటే ఉంటూ ప్రతి కార్యక్రమంలో వెన్నుదన్నుగా నిలుస్తున్న తెలంగాణ రక్షణ సేన నాయకులు సిద్ధంశెట్టి సాజన్ ను మంచిర్యాల జిల్లా టీఆర్ఎస్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ గా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

పాత్రికేయుల సేవలు అభినందనీయం

- ఐజేయూ నూతన కార్యవర్గానికి సత్కారం



మల్లాపూర్, అక్టోబర్ 28 (ప్రతినిధి): ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని సిరిపూర్ సర్పంచ్ పెంట సౌజన్య-శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మల్లాపూర్ మండల నూతన కార్యవర్గాన్ని సిరిపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.మండల అధ్యక్షుడు సభావత్ మల్లేష్, ఉపాధ్యక్షుడు బద్ధం రామ్ చందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బద్ధం శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి సింగిరెడ్డి అశోక్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంట సౌజన్య-శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి సమాజ అభివృద్ధిలో పాత్రికేయులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పాత్రికేయ రంగంలో మరింత ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, వార్డు సభ్యులు మాధవ రెడ్డి, ఇప్ప గంగారెడ్డి, నల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు

-అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

-పారదర్శకంగా చామనపల్లి ఆర్ అండ్ ఆర్ సర్వే



ధర్మారం, అక్టోబర్ 28 : (ప్రజా కలం ప్రతినిధి) చామనపల్లి గ్రామంలో ఆర్ అండ్ ఆర్ సర్వే పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామం లో జరుగుతున్న ఆర్ అండ్ ఆర్ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు బుధవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ నంది మేడారం రిజర్వాయర్ లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసే క్రమంలో చామనపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, నిబంధనల్లో సడలింపులు కల్పిస్తూ గ్రామం మొత్తాన్ని భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు గ్రామంలోని ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రత్యేక ప్రాజెక్టు నంబర్ కేటాయించి, ఇంటిలోని కుటుంబ సభ్యుల వివరాలతో పాటు చెట్లు, మోటార్లు, ఇతర పరికరాలు తదితర ఆస్తుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.సేకరించిన వివరాల ఆధారంగా చట్ట ప్రకారం అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, పక్కాగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే బృందాలకు గ్రామ ప్రజలు తమ పూర్తి వివరాలను అందించి, సర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంపూర్ణ సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

- కలెక్టరేట్‌లో ఉద్యోగులతో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ

పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు ప్రజలు 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పిలుపునిచ్చారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అవినీతి నిరోధక వారోత్సవాల సందర్భంగా జిల్లా అధికారులు,తహసీల్దార్లు,సిబ్బందితో ఆయన అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కని, ఎవరైనా లంచం అడిగితే ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా వెంటనే 1064 నంబర్‌కు సమాచారం అందించాలని స్పష్టం చేశారు.అవినీతి నిర్మూలనలో ప్రజలు,అధికారులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో విజిలెన్స్ విభాగం సిబ్బంది,జిల్లా స్థాయి అధికారులు,తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావం తగు జాగ్రత్తలు

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 28(ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లోని.. తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వర్యులు సీతక్క కమిషనర్ మేడం దివ్య నటరాజన్ ఉదయం 10:30 నిమిషాల నుండి ఎల్నినో ప్రభావం మరియు తగు జాగ్రత్త ల పైన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, కమ్యూనిటీ సోక్ పిట్ లు నిర్మించాలని, డ్రైనేజి ఎండ్ పాయింట్ సోక్ పిట్ నిర్మించాలని, ఫామ్ పాండ్ మరియు బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ నిర్మించాలని తెలుపడం జరిగింది. ఇట్టి సమావేశం లో ఎంపీడీఓ. సిహెచ్. గణేష్. డి ఎల్ పి ఓ. రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ రామక్రిష్ణ రాజు. ఏ ఇ , ఆర్డబ్ల్యూఎస్.ఏ ఇ.ఇరిగేషన్ , సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఎండీపీవో సిహెచ్ గణేష్ డి ఎల్ పి ఓ రాజేంద్ర ప్రసాద్ తో కలిసి ఎంపీఓ రామక్రిష్ణ రాజు,ఎ ఇ ఆర్డబ్ల్యూఎస్.ఎ ఇ.ఇరిగేషన్ , పంచాయతీ కార్యదర్శుల తో ఎల్నినో ప్రభావం పైన కమిషనర్ సూచనలను సలహాలను గ్రామాలలో ఎలా ఇంప్లిమెంటేషన్ చేయాలో తీసుకువాల్సిన జాగ్రత్త లను జరిగే పనుల పైన సమావేశం నిర్వహించడం జరిగింది.



కులాంతర వివాహాలతోనే సమసమాజ నిర్మాణం

- ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

- 45 మంది లబ్ధిదారులకు ప్రోత్సాహక చెక్కుల అందజేత




పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సమాజంలో కులవివక్షను రూపుమాపి, సామాజిక ఐక్యత,సమానత్వాన్ని సాధించడంలో కులాంతర వివాహాలు కీలక పాత్ర పోషిస్తాయని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు.స్థానిక గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 45 మంది లబ్ధిదారులకు ఆయన కులాంతర వివాహ ప్రోత్సాహక చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా జీవించాలని ఆకాంక్షించారు.సామాజిక సమానత్వం,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని,నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు,నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిఆర్సి వెంటనే ప్రకటించకపోతే మరో ఉద్యమమే

టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె శ్రీనివాసరావు

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 28(ప్రజా కలం ప్రతినిధి) ఇబ్రహీంపట్నం మండలంలోని ఆయా పాఠశాలల్లో టీఎస్ యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారుపిఆర్సికాలపరిమితి మూసినందున నివేదిక వెంటనే తెప్పించుకొనిఅమలుచేయాలన్నారు.ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలనిడిమాండ్చేశారు.బదిలీలు ప్రమోషన్లు చేపట్టి పాఠశాల విద్యను బలపతం చేయాలన్నారు, ఆదర్శ పాఠశాలలను 317 జీఓ ను అమలు చేయడంతో పాటు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలనిపేర్కొన్నారు.కస్తూర్బాపాఠశాలఉపాధ్యాయులకు సర్వ శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాదె శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు దస్తరి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాణదాతల పోరుబాట సర్కారుకు సిగ్గుచేటు

- నిరవధిక సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

- మాజీ పురపాలక అధ్యక్షురాలు డాక్టర్ మమతారెడ్డి

పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జాతీయ ఆరోగ్య ఉద్యమ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకై చేపట్టిన నిరవధిక సమ్మెకు భారత రాష్ట్ర సమితి సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. పెద్దపల్లిలో కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని రామగుండం మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి మున్సిపల్ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ మమతారెడ్డి బుధవారం సందర్శించి,ఉద్యోగుల ఆందోళనకు ప్రత్యక్ష మద్దతు పలికారు.ఈ సందర్భంగా డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ కరోనా విపత్కర కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని కాపాడిన ఎన్‌హెచ్ఎం సిబ్బంది,నేడు తమ భవిష్యత్తు కోసం,ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కాల్సి రావడం అత్యంత విచారకరమన్నారు.అనాడు ప్రజా ప్రాణాలు నిలిపాం..నేడు మా బతుకుల కోసం పోరాడుతున్నాం అంటూ ఉద్యోగులు వ్యక్తం చేస్తున్న తీవ్ర ఆవేదన పాలకులకు ఎందుకు కనిపించడం లేదని ఆమె నిలదీశారు.అనంతరం



కోరుకంటి చందర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్న ఎన్‌హెచ్ఎం సిబ్బందిని ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు.ఐక్యతే బలం – హక్కుల సాధనే లక్ష్యంగా సాగుతున్న ఈ పోరాటం న్యాయమైనదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ నాయకులు,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా బెల్లంపల్లి ప్రభుత్వ

కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థుల భారీ ర్యాలీ



బెల్లంపల్లి, అక్టోబర్ 28, (ప్రజాకలం) ప్రతినిధి : బెల్లంపల్లి లోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ (మాదకద్రవ్యాల రహిత భారతదేశం) కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అవునూరి అంజయ్య మాట్లాడుతూ 70 శాతం యువత ఉన్న భారతదేశాన్ని నిర్వీర్యం చేసే 'నార్కో టెర్రరిజం'వంటి అంతర్జాతీయ కుట్రలో భాగంగానే మాధకద్రవ్యాల సరఫరా జరుగుతుందని, యువత దీనిని గుర్తించి మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ బెల్లంపల్లి డివిజన్ బాధ్యులు లక్ష్మీనారాయణ,గజెల్లి మోహన్,సామాజిక సేవకులు వేల్పుల రాజేందర్,కళాశాల సిబ్బంది పాల్గొని ఆరోగ్య కరమైన జీవన శైలిని అనుసరించాలని,వ్యసనాలకు యువత బానిసలు కావద్దని సూచించారు.అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలతో బెల్లంపల్లి బస్తీలోని కళాశాల ఆవరణ నుండి మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, నషాముక్త్ భారత్ లక్ష్య సాధనకు కృషి చేయడం జరిగింది.

పరఖ్ సర్వేక్షణ్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్ - మూడో తరగతి విద్యార్థుల కోసం గణిత ప్రశ్నావళి ఆవిష్కరణ

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 28(ప్రజా కలం)

వచ్చే విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా మూడో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసే లక్ష్యంతో రూపొందించిన ప్రాథమిక గణిత ప్రశ్నావళిని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు.గతంలో నిర్వహించిన ప్రాథమిక స్థాయి పాఠశాల సముదాయ సమావేశంలో ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా ఈ ప్రశ్నావళిని రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నల నిధిని త్వరగా రూపొందించి, విద్యార్థులతో నిరంతరం సాధన చేయించాలని సూచించారు.జిల్లా విద్యాశాఖ అధికారి రాము మాట్లాడుతూ, నవంబర్‌లో జరిగే పాఠశాల సముదాయ సమావేశంలో ఉ



పాధ్యాయులకు మిడ్‌లైన్ పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. భాష, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నల నిధిని కూడా రూపొందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిసిఈబి సెక్రటరీ మురళీ మనోహరచారి, జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ సెల్ సభ్యులు సంధి శ్రీనివాస్ రెడ్డి, కడకుంట్ల అభయ్ రాజ్, గుండు విజయ్, దాసరి జయంత్ తదితరులు పాల్గొన్నారు.


తుపాను వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు!

తుఫాను ఎండల సెగ నుంచి ఉపశమనం కలిగించేనా వర్షం పడితే పంటలకు ప్రాణం!

మహబూబాబాద్: ఒకవైపు ఎండల తీవ్రత.. మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు.. ఇంకోవైపు పంటల పరిస్థితిపై ఆందోళన చెందుతున్న అన్నదాతలు! ఇలాంటి తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ బలపడి తుపానుగా మారే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలు రైతుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. రానున్న రోజుల్లో కురిసే వర్షాలు తమ పంటలకు ప్రాణం పోస్తాయా? సాగు ఖర్చులైనా చేతికొస్తాయా? అన్న ఆశతో రైతన్నలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

వర్షమే రైతన్నకు జీవనాధారం!: ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా మారే అవకాశం ఉండగా, అక్టోబర్ 28 ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే సూచనలున్నాయి. దీని ప్రభావంతో తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ తదితర జిల్లాల్లో వర్షాలు కురిస్తే వ్యవసాయ రంగానికి కొంత ఊరట లభించే అవకాశం ఉంది. అయితే వర్షాల పరిమాణం, విస్తృతి, తీవ్రతపై స్పష్టత వాతావరణ శాఖ తాజా సూచనలతోనే తెలుస్తుంది.

చినుకు పడితే కోట్ల ఆశలకు జీవం!: వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆశలన్నీ వర్షాలపైనే కేంద్రీకృతమయ్యాయి. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు అనుకూల వాతావరణం ఎంతో అవసరం. సరైన సమయంలో వర్షం కురిస్తే పంటలకు మేలు జరగడంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా రానున్న సాగుకు కూడా ప్రయోజనం కలగవచ్చు. తుపాను ప్రభావంతో వర్షాలు కురిసి పంటలకు అనుకూల పరిస్థితులు ఏర్పడితే రైతులు



పెట్టిన పెట్టుబడులు వృథా కాకుండా కొంతైనా ఆశించిన ఫలితాలు దక్కుతాయని భావిస్తున్నారు. వ్యవసాయ రంగంలో కోట్లాది రూపాయల విలువైన పంటల భవితవ్యం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉండటంతో ప్రతి చినుకు రైతులకు విలువైనదిగా మారింది.

ఆశతో పాటు ఆందోళన కూడా!: వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ, తుపాను తీవ్రత పెరిగి అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవిస్తే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం కూడా ఉంది. పొలాల్లో నీరు నిలిచిపోవడం, పంటలు నేలకొరగడం, కోతకు సిద్ధమైన పంటలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే రైతుల్లో ఒకవైపు వర్షాలు కురుస్తాయన్న ఆనందం, మరోవైపు తుపాను వల్ల నష్టం జరుగుతుందేమోనన్న ఆందోళన కనిపిస్తోంది.

అన్నదాతల చూపులు ఆకాశంవైపు!: ప్రకృతి అనుకూలిస్తేనే వ్యవసాయం సాఫీగా సాగుతుందని మరోసారి రుజువవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. తుపాను ప్రభావం రైతులకు మేలు చేస్తుందా? లేక ఇబ్బందులు సృష్టిస్తుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ప్రస్తుతానికి మాత్రం వర్షం కోసం రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వరుణుడు కరుణించి సకాలంలో వానలు కురిపిస్తే పంటలకు ప్రాణం పోసినట్లేనని, రైతుల శ్రమకు ఫలితం దక్కే అవకాశాలు మెరుగుపడతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పేద బాలికల ఉన్నత చదువుకు వసతి భరోసా

ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాగూర్

రూ. 2.12 కోట్లతో ఎస్సీ బాలికల హాస్టల్ ప్రారంభం

పెద్దపల్లి,అక్టోబర్ 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పేద విద్యార్థినుల ఉన్నత విద్యకు,వారి బంగారు భవిష్యత్తుకు మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు ఎంతో కీలకమని రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాగూర్ అన్నారు.గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయ నమీవంలోని 60వ డివిజన్ మారుతినగర్‌లో ఎన్టీపీసీ కార్పొరేట్ సామాజిక బాధ్యత సీఎస్ఆర్ నిధులు రూ.2.12 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని రామగుండం మేయర్ మహంకాళి స్వామి,ఎన్టీపీసీ ఈడీ ఫైజ్ తయ్యబ్‌లతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ,పేద వర్గాలకు చెందిన బాలికలు సురక్షితమైన వాతావరణంలో విద్యను కొనసాగించేందుకు ఈ వసతి గృహం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతతో విద్యార్థుల కోసం అధునాతన భవనాన్ని నిర్మించిన ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.బాలికల విద్యాభివృద్ధికి, నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు,వివిధ ప్రజా సంఘాలు,విభాగాల ప్రతినిధులు,విద్యార్థినులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన పీఎం శ్రీ జిల్లా స్థాయి క్రీడా పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



సుల్తానాబాద్,అక్టోబర్ 28:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి) పీఎం శ్రీ పాఠశాలల పెద్దపల్లి జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండో రోజు బాలురకు కబడ్డీ,వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు.వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు.పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఈ సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్,కార్యదర్శి అమరిశెట్టి తిరుపతి,ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ బహుమతులు అందజేసి అభినందించారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి,క్రమశిక్షణ,జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేల్పుల సురేందర్,కార్యదర్శి దాసరి రమేష్,యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ శోభారాణి,పీఈటీ రాష్ట్ర బాధ్యులు కొమురోజు శ్రీనివాస్,డాక్టర్ రవి,సుల్తానాబాద్ జోనల్ కార్యదర్శి ప్రణయ్,జావేద్ కుమార్,కిషోర్, విష్ణు,సంధ్య,శ్రీవాణి,సదయ్య,వెంకటేష్,దొడ్ల దేవేందర్‌తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మయన్మార్ మహిళపై అఘాయిత్యం

స్నేహితులతో కలిసి భర్త గ్యాంగ్ రేప్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మయన్మార్‌కు చెందిన మహిళపై ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కంచన్‌బాగ్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. మయన్మార్‌కు చెందిన మహిళను బంగ్లాదేశ్‌కు చెందిన ఫయజ్ అనే వ్యక్తి వివాహం చేసుకున్నాడు.అనంతరం వీరిద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన ఫయజ్.. తన స్నేహితులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవాలంటూ భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలోనే ఆమెపై భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త ఫయజ్‌తో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులంతా బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మహిళ నుంచి రూ.4.50 లక్షలు వసూలు..

ఆపై రిసార్ట్‌కు తీసుకెళ్లి అత్యాచారం

ఘట్‌కేసర్ : ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.4.50 లక్షలు వసూలు చేసి, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఘట్‌కేసర్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్లాపూర్‌లోని బ్రహ్మపుత్ర కాలనీలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న 30 ఏళ్ల మహిళకు భువనగిరికి చెందిన జగన్మోహన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేనేజర్‌గా పనిచేస్తున్నానని, ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఇందుకోసం ఉన్నతాధికారికి డబ్బులు ఇవ్వాలని, మొత్తం రూ.5 లక్షలు ఖర్చవుతాయని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఉద్యోగం వస్తుందనే ఆశతో బాధితురాలు విడతలవారీగా రూ.4.50 లక్షలు నిందితుడికి ఇచ్చినట్లు సమాచారం. అనంతరం ఉద్యోగం ఇప్పించే విషయమై మాట్లాడాలంటూ జగన్మోహన్ బాధితురాలిని కారులో తీసుకెళ్లాడు. మల్లాపూర్ నుంచి భువనగిరికి వెళ్తున్నట్లు చెప్పి, మార్గమధ్యంలో ఘట్‌కేసర్ పరిధిలోని అవుషాపూర్‌లో ఉన్న ఓ రిసార్ట్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ ఉన్నతాధికారి ఉన్నారని మహిళను నమ్మించిన నిందితుడు, అనంతరం ఆమెను బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం మత్తులో దాబాలో ప్రభుత్వ ఉద్యోగుల హల్ చల్

మేడ్చల్ : మద్యం మత్తులో ప్రభుత్వ ఉద్యోగులు దాబాలో హల్ చల్ చేసారు. కొంపల్లి ఫ్రెండ్లీ దాబాకు కొంపల్లి సర్కిల్ శానిటేషన్ అధికారులు వెళ్లి మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. దాబాను మూసివేయిస్తామని బెదిరించారు. డీఈఈ తిరుపతి, ఎన్విరాన్‌మెంట్ విభాగం ఇన్‌ఛార్జ్ రాఘవాచారి దాబా యాజమాని కొడుకుపై, సిబ్బందిపై బూతులు తిట్టారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తానూర్ మాజీ సర్పంచ్ తల్లి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్ రావు పటేల్ పరామర్శ

తానూర్, అక్టోబర్ 28(ప్రజా కలం):

మండల కేంద్రమైన తానూర్ కు చెందిన మాజీ సర్పంచ్ డి. రాములు గారి మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే, ముధోల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ భోస్లే నారాయణ రావు పటేల్ పరామర్శించారు,బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు,ఈ కార్యక్రమంలో తానూర్ మండల అధ్యక్షుడు పుండలీక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రకాంత్ యాదవ్, గోవింద్ రావు పటేల్, లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కుంటాల సొసైటీకి బదిలీ అయిన హంగీర్గా సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ వికాస్ రెడ్డికి ఘన వీడ్కోలు



తానూర్, అక్టోబర్ 28(ప్రజా కలం): మండల కేంద్రంలోని హంగీర్గా సొసైటీలో స్టాఫ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించి, బదిలీపై కుంటాల సొసైటీకి వెళ్తున్న ఎ. వికాస్ రెడ్డిని తోటి సిబ్బంది, పాలకవర్గ నభ్యులు ఘనంగా సన్మానించారు,బుధవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన చేసిన సేవలను వక్తలు ప్రశంసించారు,ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ జె. నారాయణ రావు పటేల్, డైరెక్టర్ కదం గోవింద్ పటేల్, సీఈఓ సాయరెడ్డి, బ్యాంక్ సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి జన్మదినం సందర్భంగా రక్తదానం

- నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి: గుండా ఉపేందర్ రెడ్డి

పాలేరు అక్టోబర్ 28(ప్రజా కలం న్యూస్) మంత్రి జన్మదినం సందర్భంగా తలసేమియా బాధితులకు అండగా రీతన్య వాలంటరీ రక్త కేంద్రంలో రక్తదానం చేసినట్లు టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈ



సందర్భంగా పాలేరు నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వార్డు సభ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేసి పాలకమండలి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. కూసుమంచిలో బస్‌స్టాండ్ నిర్మాణం, 24 గంటల బస్సు సర్వీసులు, బైపాస్ ఫ్లైఓవర్ వద్ద బస్సుల నిలుపుదల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డయాలసిస్ మిషన్ల సంఖ్య పెంచడంతో పాటు నియోజకవర్గంలో కొత్త డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరారు. గణపేశ్వరాలయం పక్కన ఉన్న ముక్కంటేశ్వరాలయాన్ని పునఃప్రతిష్ఠించి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, డిజిటల్ లైబ్రరీ, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు.అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు నీటి ఎద్దడి నివారణకు సీతారామ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ని కోరారు.

తానూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి డిమాండ్



తానూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పూండ్ర లక్ష్మణ్ రెడ్డి డిమాండ్ చేశారు,మండలంలోని 32 గ్రామాలు వర్షాధారమేనని, ఈ ఏడాది జిల్లాలోనే అతి తక్కువ వర్షపాతం ఇక్కడే నమోదైందని తెలిపారు, గ్రావిటీ, బోరుబావుల సౌకర్యం లేక, ఉన్న బోర్లకు విద్యుత్ సరిగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, స్థానిక నాయకత్వం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కరువు మండలంగా ప్రకటించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం

అర్హులైన ఒక్క ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు

రాజకీయ పార్టీల సహకారం అభినందనీయం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు ఓటు హక్కును కోల్పోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఫామ్-6, ఫామ్-8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, తిరస్కరణకు గల ప్రధాన కారణాలను వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లువెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

- జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన

- క్షేత్ర స్థాయిలోని ప్రతి సమస్యను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలి

- ఈఆర్ఓ లతో ఎలక్టోరల్ రోల్ పై సమీక్షించిన ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్



పాలేరు అక్టోబర్ 28(ప్రజా కలం న్యూస్)

ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు. బుధవారం కూసుమంచి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఈఆర్ఓ లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన మాట్లాడుతూ ఎలక్టోరల్ తయారు ఎన్నికల ముఖ్య ఘట్టమని అన్నారు. ఎలక్టోరల్ ప్రక్రియలో స్వీకరించిన ఫారం 6, 6 ఏ, 7, 8 ల పరిష్కార ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్ఓ ల తనిఖీలు చేయాలన్నారు. ఎన్ఆర్ఐ ల నుండి వచ్చిన దరఖాస్తులు నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో డోర్ టు డోర్ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్ర పరిశీలనలో గుర్తించిన సవరణలు ఎలక్టోరల్ రోల్ చేయాలన్నారు.రోల్ డాటా బేస్ లో మార్క్ ఓటర్ల గుర్తింపు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక చేర్పులు, అత్యధిక తొలగింపులు చేసిన 20 పోలింగ్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో పునఃపరిశీలన చేయాలన్నారు. నోటీసుల జారీ ప్రక్రియ సక్రమంగా చేయాలన్నారు. హియరింగ్ ప్రక్రియకు తగిన సమయం ఇవ్వాలన్నారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి రికార్డు భద్రపరచాలన్నారు. సరిహద్దు జిల్లాల వద్ద ద్వంద నమోదులు తనిఖీ చేయాలన్నారు.

ఎపిక్ కార్డుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. ప్రింట్ అయి వచ్చిన కార్డులను సంబంధిత ఓటర్లకు చేరేలా చూడాలన్నారు. యువ ఓటర్ల నమోదు పట్ల దృష్టి సారించాలన్నారు. ఓటర్ల ఫిర్యాదుల పరిష్కారంపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఖచ్చితమైన ఎలక్టోరల్ రోల్ రూపకల్పనకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ తెలిపారు.

సమీక్షలో లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 5 శాసనసభ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయని, దీనికి సంబంధించి 29 మంది ఏఈఆర్ఓలు, 88 మంది అదనపు ఏఈఆర్ఓలు, 148 మంది సూపర్‌వైజర్లు, 1,479 మంది బీఎల్ఓలు బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య 10,85,927 ఉండగా, జెండర్ రేషియో 1069గా, ఈపీ రేషియో 688గా నమోదైందని, అలాగే ఎపిక్ కవరేజ్ 99.99% పూర్తయిందని వివరించారు. జిల్లాలో 18-19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లు 11,596 మంది, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 9,111 మంది, 23,588 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ద్వారా అదనంగా 19 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,479కు చేరిందని తెలిపారు. ఎలక్టోరల్ రివిజన్ లో 53 దరఖాస్తులు ఎన్ఆర్ఐ ల నుండి అందాయన్నారు. ఫారం 6 లు 2042, ఫారం 6 ఏ లు 41, ఫారం 7 లు 153, ఫారం 8 లు 1936 మొత్తంగా 4172 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, పరిష్కారానికి చర్యలు వేగవంతం చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ఎన్నికల డిటి అన్సారీ, నాయబ్ తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డు కారాదు

ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

శతశాతం ద్వారా 45 పాఠశాలల విద్యా వాలంటీర్లకు రాజన్న ఫౌండేషన్ మరియు అమర్ రాజా సంస్థ అండ - శతశాతం కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది: అమర రాజా సంస్థ ఉపాధ్యక్షులు నిరంజన్ రెడ్డి - శతశాతం కార్యక్రమం ద్వారా సమాజానికి కావాల్సిన పునాది రాళ్ళు బాగుపడుతున్నాయి : డిఇఓ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 28:

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభకు పేదరికం అడ్డు కారాదని భావించి, నాణ్యమైన విద్యను అందించి, వారి జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావాలనే ఉన్నత లక్ష్యంతో చేపట్టిన 'శతశాతం విద్యా కార్యక్రమం'కు వివిధ సంస్థలు ముందుకొచ్చి సహకారం అందించడం సంతోషకరమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో , వందేమాతరం ఫౌండేషన్ అకాడమిక్ సహకారం అందిస్తున్న శతశాతం విద్యా వాలంటీర్లకు మూడవ నెల గౌరవ వేతనాన్ని(100 మంది విద్యా వాలంటీర్లకు ? 10 లక్షల రూపాయల చెక్కును) ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితం కోసం స్వార్థరహితంగా, పక్కా ప్రణాళికతో మంచి కార్యక్రమాలను చేపడితే సమాజంలోని వ్యక్తులు, సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వంతు సహకారం అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శతశాతం విద్యా కార్యక్రమం ద్వారా ప్రత్యేకంగా విద్యా వాలంటీర్ల సేవలను వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 45 పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనాన్ని అందించేందుకు రాజన్న ఫౌండేషన్ మరియు అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. వాలంటీర్లకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు సమాజంలోని మిత్రులు, పరిచయస్తులు, విద్యాభిమానులు, వివిధ సంస్థల ప్రతినిధులను భాగస్వాములుగా చేర్చుకోవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ క్రమంలో అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి నిరంజన్‌ను సంప్రదించి కార్యక్రమం లక్ష్యాలను వివరించగా, సంస్థ తరఫున సహకారం అందించేందుకు వారు ముందుకు రావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శతశాతం విద్యా వాలంటీర్లకు (45 పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు) ప్రతి నెలా గౌరవ వేతనాన్ని అందించేందుకు రాజన్న ఫౌండేషన్ మరియు అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ముందుకు రావడం వల్ల శతశాతం కార్యక్రమ నిర్వహణలో తమపై ఉన్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సంస్థ ముందుకొచ్చి సహకరించడం ఇతర సంస్థలకు కూడా స్ఫూర్తినిస్తుందని, మరిన్ని సంస్థలు విద్యారంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి లేదా ఒక సంస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లాల్సిన సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజ అభివృద్ధికి బలమైన పునాదులు వేయవచ్చన్నారు. శతశాతం విద్యా కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇతర కంపెనీలు, సంస్థలను కూడా భాగస్వాములుగా చేర్చుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యారంగ అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలకు సమాజం నుంచి సహకారం లభిస్తే మరింత సమర్థవంతంగా లక్ష్యాలను సాధించవచ్చన్నారు. మంచి లక్ష్యంతో, స్పష్టమైన ప్రణాళికతో, బాధ్యతాయుతమైన వ్యక్తుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తే సమాజంలోని దాతలు, విద్యాభిమానులు, సంస్థలు తప్పకుండా ముందుకొస్తాయని ఆయన పేర్కొన్నారు. శతశాతం విద్యా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించి, వారి సామర్థ్యాలను వెలికితీసి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించేందుకు ముందుకొచ్చిన అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సంస్థలు కూడా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా ను విద్యారంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలనే ఉన్నత ఆశయంతో గౌరవ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు కొరకు ఏర్పాటు చేసిన శతశాతం కార్యక్రమంతో సమాజానికి కావాల్సిన పునాది రాళ్ళు బాగుపడుతున్నాయి అని అన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి రూపకల్పన చేసిన ఎమ్మెల్యే గారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అమర రాజా సంస్థ ఉపాధ్యక్షులు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ ప్రభుత్వ విప్ లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి సహకారంతో, మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శతశాతం కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయక కార్యక్రమం అని అన్నారు. అందుకే తాము కూడా తమవంతు సహకారం ఈ శతశాతం కార్యక్రమానికి అందించాలనే లక్ష్యంతో ప్రతి నెల ?10 వేల చొప్పున 45 మంది విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, అమరరాజ వైస్ ప్రెసిడెంట్ (జూవా) నిరంజన్ రెడ్డి, సతీష్ హెడ్ ఆఫ్ రాజన్న ఫౌండేషన్, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయ కర్త రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ గుముడాల గోవర్ధన్ గౌడ్, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ విజేత వెంకట్ రెడ్డి ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, రిషి జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకలం ఎఫెక్ట్..

వాల్గొండ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన డీడబ్ల్యూఓ భాస్కర్



మల్లాపూర్, అక్టోబర్ 28 (ప్రజాకలం ప్రతినిధి): మల్లాపూర్ మండలం వాల్గొండ అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 11 గంటలైనా తెరుచుకోకపోవడం, సూపర్‌వైజర్ ఫోన్ చేసిన తర్వాతే కేంద్రం తెరిచినట్లు ప్రజాకలం దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో డీడబ్ల్యూఓ భాస్కర్ గురువారం వాల్గొండ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ తీరు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రాథమిక విద్య తదితర అంశాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్దేశిత సమయానికి తెరిచి, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని అంగన్వాడి టీచర్ కు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్లక్ష్యం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



నేడు తానూర్ మండల కేంద్రానికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రాక

- బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి

తానూర్, అక్టోబర్ 28 (ప్రజా కలం): మండల కేంద్రంలో గురువారం నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురువారం ఉదయం 11:00 గంటలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని (లైబ్రరీ) ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని పేర్కొన్నారు, అనంతరం మధ్యాహ్నం 12:00 గంటలకు తానూర్ నుండి మొగిలి మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు, ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మండల పరిధిలోని సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని లక్ష్మణ్ రెడ్డి పిలుపునిచ్చారు. సమయపాలన పాటిస్తూ అందరూ నిర్దేశిత సమయానికి హాజరుకావాలని కోరారు.




సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి: ఏఐటీయూసీ

అల్పాహార పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి: మల్లేష్

సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని క్యాంపు కార్యాలయ ఇన్చార్జికు అందజేత

పాలేరు అక్టోబర్ 28(ప్రజా కలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ రద్దుచేసి 2023-24 సంవత్సరానికి సంబంధించిన అల్పాహారం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం



వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఖమ్మం జిల్లా కార్యదర్శి గుండెపంగు మల్లేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కూసుమంచి మండల కేంద్రంలోని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాసరెడ్డికి కార్మికులతో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న వంట బిల్లులను విడుదల చేసి, ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు అందించే అల్పాహారం మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. కోడిగుడ్లు గ్యాస్ నిత్యవసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేసి వంట కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా గ్రామాలలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులను రాజకీయ మరో ఇతర కారణాలతో తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రతి విద్యార్థికి 25 రూపాయల మెస్ చార్జీలను చెల్లించి, ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీ నెలకు రూ.10000 రూపాయల వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కూసుమంచి మండల కార్యదర్శి మండవ కృష్ణకుమారి, సహాయ కార్యదర్శి గోపి రమణ, గోపి వీర లక్ష్మీ, భూక్యా శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి

పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచనలు

పాలేరు అక్టోబర్ 28 ప్రజాకలం న్యూస్ : బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుఫాన్ అర్నబ్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. రెండు జిల్లాల్లోనూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.



జోరు వానలోనూ హోరెత్తిన ప్రచారం!

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్న ఎన్నికల ప్రచారం

జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, ఎంపీటీసీ అభ్యర్థి నక్కా నరసింహారావు



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 28

జోరుగా కురుస్తున్న వానను సైతం లెక్కచేయకుండా ఎటపాక మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం హోరెత్తింది. రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి కాకా కామేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి నక్కా నరసింహారావు గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారాన్ని కొనసాగిస్తూ ప్రజలతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తమను ఆదరించి ఫ్యాన్ గుర్తుపై, హస్తం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రచారంలో వెనుకడుగు వేయకుండా అభ్యర్థులు, నాయకులు ముందుకు సాగడంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించాలి

పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా


నిర్మల్ అక్టోబర్ 28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించడంతో పాటు, ప్రాణనష్టాన్ని నివారించే లక్ష్యంతో పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్‌మెంట్) పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకం అమలులో నిర్లక్ష్యం వహించకుండా, బాధితులకు సత్వర చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకానికి సంబంధించిన పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ, అమలును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు తిరుపతి, అసీఫ్, రజినీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీళ్ళచెరువు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా మంత్రి పొంగులేటి పుట్టిన రోజు వేడుకలు

- ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు

పాలేరు అక్టోబర్ 28(ప్రజా కలం న్యూస్) రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం దేవాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరుతో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. మంత్రి పొంగులేటి వల్లనే పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అంబాల లింగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు , సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీకాంత్, సీనియర్ జర్నలిస్ట్ పెండ్ర అంజయ్య, మాజీ ఎంపీటీసీ కాసాని వెంకన్న, కిషోర్, చంటి, వీరబాబు, అర్చకులు పాల్గొన్నారు.





మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.. డీఈఓకు ఏఐటీయూసీ వినతి



నాగర్ కర్నూల్, అక్టోబర్ 28 (ప్రజాకలం) : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లు

జిల్లావ్యాప్తంగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన పెండింగ్ వంట బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనం తయారీ బాధ్యతలను ప్రస్తుతం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంట కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లు, వంట గ్యాస్, ఇతర నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు గతంలో అల్పాహారం తయారు చేసినందుకు సంబంధించిన బిల్లులు, పెండింగ్ పారితోషికాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వంట కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని, రాజకీయ లేదా ఇతర కారణాలతో కార్మికులను విధుల నుంచి తొలగించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి మెనూ ఛార్జీల కింద రూ.25 చెల్లించి మధ్యాహ్న భోజన కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, జిల్లా నాయకుడు మారేడు శివశంకర్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గడ్డి, కొప్పుల లక్ష్మి, పుట్ట పార్వతమ్మ, ఆకుమని భీమమ్మ, ఆకున మౌని తిరుపతయ్య, పి. జగన్, వి. మధు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి

- షాపు వద్ద రూ.50.. గ్రామాల్లో రూ.80 నుంచి రూ.100 వరకు వసూలు

- ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి బాలేశ్వర్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 28 (ప్రజాకలం):వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీలో వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి బాలేశ్వర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలపై గ్యాస్ పంపిణీ పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఒక్కో సిలిండర్‌పై అదనపు వసూళ్లకు పాల్పడుతున్నగ్యాస్ ఏజెన్సీ షాపు వద్ద సిలిండర్ తీసుకున్నా అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారని, గ్రామాలకు సిలిండర్ తీసుకొచ్చి పంపిణీ చేసినప్పుడు ఒక్కో సిలిండర్‌పై రూ.80 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని అయన ఆరోపించారు. ఈ అదనపు మొత్తాలను ఎందుకు చెల్లించాలని వినియోగదారులు ప్రశ్నిస్తే, తమకు కంపెనీ నుంచి రవాణా చార్జీలు చెల్లించడం లేదని, అందుకేవినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నామని డెలివరీ సిబ్బంది చెబుతున్నట్లు తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా వసూళ్లు ఉండాలి

గ్యాస్ సిలిండర్ ధరకు అదనంగా ఏయే చార్జీలు వసూలు చేయవచ్చనే విషయంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని బాలేశ్వర్ కోరారు. గ్యాస్ పంపిణీ సంస్థలు, ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించాలని, వినియోగదారుల నుంచి అనధికారికంగా అదనపు మొత్తాలు వసూలు చేస్తే వాటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు వంట గ్యాస్ సిలిండర్ ధరతో పాటు అదనపు చార్జీలు మరింత భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సిలిండర్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తే నెలవారీ కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.



వినియోగదారులకు న్యాయం చేయాలి

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత గ్యాస్ కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, సిలిండర్ల పంపిణీ సమయంలో జరుగుతున్న అదనపు వసూళ్లపై విచారణ చేపట్టాలని కోరారు. వినియోగదారులకు నిర్ణీత ధరలు, వర్తించే డెలివరీ చార్జీల వివరాలను పారదర్శకంగా తెలియజేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో అదనపు డబ్బులు చెల్లించాల్సి వస్తే వినియోగదారులు రసీదు అడగాలని, వసూళ్లకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకుని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా, గ్యాస్ సిలిండర్ల పంపిణీలో పారదర్శకత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలంగా హక్కుల జిల్లా కార్యదర్శి బాలేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ లోపాలను అధికారులు ప్రభుత్వం అరికట్టకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి - సీతారాంపేట గ్రామంలో రీసర్వే, అంగన్‌వాడీ, పాఠశాల, పంట పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 28:

చిన్నచింతకుంట మండలం సీతారాంపేట గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటించి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులతోపాటు అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పారిశుధ్య నిర్వహణ, పంట పొలాలను పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరును సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

గ్రామంలో మొత్తం భూమి విస్తీర్ణం, ఇప్పటివరకు పూర్తయిన సర్వే, ఇంకా పెండింగ్‌లో ఉన్న భూమి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులు అధిక శాతం పూర్తయ్యాయని అధికారులు వివరించగా, మిగిలిన భూమికి సంబంధించిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన అవగాహన కల్పిస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల తనిఖీ

అనంతరం గ్రామంలోని అద్దె భవనంలో రెండు గదులతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో సిబ్బంది, చిన్నారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర నిర్వహణకు అనువైన ప్రత్యామ్నాయ భవనాలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతుల నిర్వహణ, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి

గ్రామంలో పర్యటించిన కలెక్టర్ మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడం, విచ్చలవిడిగా చెత్త వేయడం, కాలువల్లో వ్యర్థాలు పడేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించి, మండల పంచాయతీ అధికారుల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.

పంటల సాగుపై రైతులకు సూచనలు

గ్రామంలోని పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో సాగు వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలు, కందుల సాగు అవకాశాలు, వర్షాల ప్రభావం, పంట దిగుబడిపై ఆరా తీశారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలపై రైతులకు తగిన సూచనలు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

దేవరకద్ర మండల పరిధిలో రహదారి పక్కన సాగు చేస్తున్న బంతిపూల తోటలను కూడా కలెక్టర్ పరిశీలించారు. బంతిపూల సాగు విధానం, పంట కాలం, సాగుకు సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న నారాయణ

విద్యార్థులకు నగదు బహుమతులు



ఖమ్మం అక్టోబర్ 28(ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోనే బుధవారం నారాయణ విద్యాసంస్థల్లో చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు ఖమ్మం నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు . క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ , పట్టుదల , ఆత్మవిశ్వాసం , నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు . విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నారాయణ విద్యాసంస్థలు నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని అన్నారు . ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఎస్. అమూల్య జాయిస్ , కె. స్ఫూర్తి , డి. మిథిలేష్ , జి. లేఖన , ఇ. వరుణ్ , డి. విహాన్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు . విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు , తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ ఆకాంక్షించారు . విద్యార్థుల విజయాల పట్ల పాఠశాల పీఈటీలు చందు , పావని మరియు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు .

కూటమి అభ్యర్థిని గెలిపించాలి!

ఎటపాక జడ్పీటీసీ కూటమి అభ్యర్థి ఉబ్బా సుస్మితకు మద్దతుగా కూటమి నాయకుల పిలుపు



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 28: ఎటపాక జడ్పీటీసీ కూటమి అభ్యర్థి ఉబ్బా సుస్మితకు మద్దతుగా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బుధవారం ఎటపాక మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు మాట్లాడుతూ, జడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థి ఉబ్బ సుస్మితకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కూటమి శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని వారు అన్నారు. ఎటపాక జడ్పీటీసీ కూటమి అభ్యర్థి ఉబ్బ సుస్మిత ఎన్నికల గుర్తు ఎయిర్ కండిషనర్ అని పేర్కొంటూ, ఆ గుర్తుకు ఓటు వేసి ఆమెకు మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు. మండలంలోని గ్రామాల్లో ప్రచారాన్ని విస్తృతం చేసి, అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు సూచించారు. ఎన్నికల ప్రచారంలో సమష్టి కృషి, సమన్వయం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి వల్లభనేని చందూ, జిల్లా నాయకుడు పాటి సంపత్, జనసేన మండల అధ్యక్షుడు మరసు గంగాధర్, బీజేపీ మండల అధ్యక్షుడు నలజాల శ్యామ్, టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వర్లు, చేకూరి వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ



మహబూబ్‌నగర్, ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 28:

మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) జె.ఎల్.బి. హరిప్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్-2026) పురోగతిని సమీక్షించారు.ఈ సమావేశంలో జడ్చర్ల మండల డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా 28.10.2026 నాటికి ఎస్ఐఆర్--2026లో భాగంగా నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ పురోగతిని ఈఆర్ఓ సమీక్షించారు. ఇప్పటివరకు 99.74 శాతం నోటీసుల పంపిణీ, 98 శాతం విచారణలు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా విచారణలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే, ఏఈఆర్ఓల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి, వాటిని నిర్దిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆమోదించిన, తిరస్కరించిన దరఖాస్తుల జాబితాలను సిద్ధం చేసి, ప్రజల సమాచారార్థం నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని, వాటి ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్-2026కు సంబంధించిన సమాచారాన్ని, కార్యకలాపాలను సక్రమంగా నమోదు చేసి, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి, వారి సందేహాలను ఈఆర్ఓ నివృత్తి చేశారు. ఎస్ఐఆర్-2026లో భాగంగా నోటీసుల జారీ, విచారణల ప్రక్రియ 05.11.2026తో ముగియనున్నట్లు, తుది ఓటరు జాబితాను 09.11.2026న ప్రచురించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా, ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈఆర్ఓ కోరారు. సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిర్దిత గడువులోగా పారదర్శకంగా, సజావుగా పూర్తి చేయాలని సూచించారు.

ఉత్తమ గ్రామ పంచాయతీ ఎంపికకు

చాగాపురంలో అధికారుల పరిశీలన!



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 28 (ప్రజా కలం):

జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని చాగాపురం గ్రామాన్ని ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసేందుకు నిర్దేశించిన అర్హతలు, ప్రమాణాల అమలును పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వెస్లీ, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. నర్సింగ్ రావు మంగళవారం పరిశీలించారు.

కేంద్ర ప్రభుత్వ బృందం బుధవారం గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తమ గ్రామ పంచాయతీ ఎంపికకు అవసరమైన ప్రమాణాలకు అనుగుణంగా గ్రామంలో చేపట్టిన పనులను సమీక్షించారు. కేంద్ర బృందం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, డీఎల్‌పీఓ ప్రవీణ్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ సునీల్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించిన బీసీ రాజ్యాధికార యాత్ర

పడమటిపల్లికి చేరుకున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యాత్ర పూర్తి..

తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికిన టీఆర్పీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు

నల్లగొండ : బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించడంతో పాటు రాజ్యాధికారంలో సముచిత వాటా సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర మంగళవారం నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాదయాత్రను పూర్తి చేసుకున్న ఆయన, నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పడమటిపల్లి గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికారు. యాత్రలో భాగంగా బీసీల రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాధికారంలో వారి భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆయన ముందుకు సాగుతున్నారు. బీసీ వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈ పాదయాత్రకు వివిధ ప్రాంతాల్లో బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపుతున్నారు. పడమటిపల్లి గ్రామం నుంచి దేవరకొండ వైపు బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగనుంది.

నరసరావుపేటలో గుర్తుతెలియని మృతదేహం కలకలం

పల్నాడు: నరసరావుపేట పట్టణంలోని అరండల్‌పేట పూజిత హాస్పిటల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం. నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికావాల్సి ఉంది.

చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయాలి

రక్త పరీక్షల కోసం రోగుల అవస్థలు.. రిపోర్టుల కోసం 24 నుంచి 48 గంటల నిరీక్షణ

చెన్నూరు: చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల కోసం రోగులు పెద్ద ఎత్తున లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ సేకరించిన రక్త నమూనాలను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి పరీక్షలు నిర్వహించాల్సి వస్తోంది. అనంతరం రిపోర్టులు చెన్నూరుకు చేరేందుకు సుమారు 24 గంటల సమయం పడుతోంది. ఒకవేళ ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే రిపోర్టులు అందడానికి 48 గంటల వరకు ఆలస్యం అవుతోంది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి, త్వరగా వైద్యం అందించడం ఎంతో ముఖ్యం. అలాంటప్పుడు రిపోర్టుల కోసం ఒకటి, రెండు రోజులు వేచి చూడాల్సి రావడం రోగులకు ఇబ్బందికరంగా మారుతోంది. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేస్తే రక్త పరీక్షలు స్థానికంగానే నిర్వహించే అవకాశం ఉంటుంది. దీంతో పరీక్షల ఫలితాలు త్వరగా అందడంతో పాటు వైద్యులు సకాలంలో చికిత్స ప్రారంభించేందుకు వీలవుతుంది. కావున గౌరవ మంత్రి వర్యులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ: సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ : కరీంనగర్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు మంగళవారం కరీంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ. రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానానికి కులం, మతం, ప్రాంతం, లింగభేదాలతో సంబంధం లేదని, ఇది మానవత్వానికి, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తదానం చేసే ముందు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

భైంసా సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

2040 అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భైంసా పట్టణ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ కీలకంగా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. బుధవారం భైంసా పురపాలక కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ అమలుపై రెండో కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్‌పై సంబంధిత స్టేక్‌హోల్డర్లతో ఇప్పటికే కలెక్టరేట్‌లో తొలి కన్సల్టేటివ్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుత ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు, ప్రజాప్రతినిధులకు, సంబంధిత వర్గాలకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాజా గణాంకాల ప్రకారం భైంసా పట్టణ జనాభా సుమారు 60 వేల వరకు ఉందని, భవిష్యత్‌లో జనాభా మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పట్టణ ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 2040 నాటికి పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మైదానాలు, పార్కులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సహకారం, సూచనలతో భైంసా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసి పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేద్దామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మాస్టర్ ప్లాన్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని సూచించారు. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై ఎవరికైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పారిశ్రామిక, వాణిజ్య, నివాస ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ మౌలిక వసతుల మెరుగుదలకు మాస్టర్ ప్లాన్ ఎంతో కీలకమని పేర్కొన్నారు. కన్సల్టేటివ్ వర్క్‌షాప్‌లో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఏడీ అశ్విని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. పారిశ్రామిక, వాణిజ్య, నివాస జోన్లకు సంబంధించిన పటాలను, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై పలువురు వ్యక్తం చేసిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వైస్ చైర్మన్ కుతిజా సిద్దికీ, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్, కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో తుళ్ల రవికి కీలక బాధ్యతలు!

- టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం.

- ఎస్సీ విభాగం విస్తరణకు.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.

అక్టోబర్ 28 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఎస్సీ విభాగంలో కీలక నియామకం జరిగింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తుళ్ల రవికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నూతనంగా నియమితులైన తుళ్ల రవికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హన్మకొండలోని సుబేదారి క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వుల ప్రతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ఎస్సీ విభాగం విస్తరణే లక్ష్యం!

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో విస్తరించేందుకు తుళ్ల రవి కృషి చేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి పార్టీ చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని సూచించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు.



కాంగ్రెస్ శ్రేణుల హర్షం

తుళ్ల రవికి రాష్ట్రస్థాయి బాధ్యతలు దక్కడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకన్న గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, ఐనవోలు మాజీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కొత్తపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పోశాల మధుకర్ గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దీకొండ ఉపేందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి, సర్పంచ్ ఫోరం ఉపాధ్యక్షుడు దుబ్బ అంజన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామర ప్రశాంత్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!

- రబీ సాగులో నీటి పొదుపునకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు



అక్టోబర్ 28 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రబీ సీజన్‌లో ఉష్ణోగ్రతలు పెరిగి, భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశమున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని పేర్కొన్నారు. వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ సీన పెళ్లి రాజు అధ్యక్షతన 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమంతో పాటు 2026-27 రబీ సీజన్‌లో పంటల సాగు విధానాలపై అవగాహన సమావేశం నిర్వహించారు.

నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్న పంటల సాగును తగ్గించి, ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, కంది, అలసంద, శనగ వంటి పప్పుదినుసులు, వేరుశనగ, నువ్వులు, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి నూనెగింజ పంటలను సాగు చేయాలని సూచించారు. నేల స్వభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. వరి సాగు చేసే ప్రాంతాల్లోనూ పరిస్థితులకు అనుగుణంగా పప్పుదినుసుల సాగు అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు.

డ్రిప్ సేద్యంతో నీటి పొదుపు

ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేయగల, తక్కువ కాలంలో దిగుబడినిచ్చే కూరగాయల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. మామిడి తోటలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బిందు సేద్యం, తుంపర సేద్యం పద్ధతులను వినియోగించి నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కోసం ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయడంతో పాటు, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని వివరించారు.

నేల ఆరోగ్యమే రైతులకు బలం

వ్యవసాయ అవశేషాల సమర్థ నిర్వహణ, నేల సారవంతత పరిరక్షణ, పంట మార్పిడి, సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. స్థానికంగా కోతుల బెడదతో పాటు ఇతర పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తమ భూములకు అనువైన ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్, కుసుమ, ఆముదం వంటి పంటల సాగు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఈ కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగం, కేవీకే మామునూరు శాస్త్రవేత్త రాజు, మండల వ్యవసాయ అధికారి పి. విజయ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి జె. వేణుమాధవ్, వ్యవసాయ విస్తరణ అధికారి ఇ. పవన్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- ఆర్టీఓ ఆఫీస్ జంక్షన్‌లో పోలీస్ బ్రాస్ బ్యాండ్ ప్రదర్శన



హనుమకొండ అక్టోబర్ 28 ప్రజా కలం ప్రతినిధి

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని, అమరులైన పోలీస్ అధికారుల, సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ స్థానిక ఆర్.టి.ఓ ఆఫీస్ జంక్షన్ వద్ద 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీస్ బ్రాస్ బ్యాండ్ మ్యూజికల్ ప్రదర్శనను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పోలీస్ బ్రాస్ బ్యాండ్ బృందం వారు ఆలపించిన పలు దేశభక్తి గీతాలు,స్ఫూర్తిదాయకమైన మ్యూజికల్ ధ్వనులు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాంతిభద్రతల రక్షణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల స్మృత్యర్థం ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో అవగాహన,గౌరవాన్ని పెంపొందించేందుకు ఈ సంగీత విభావరిని ఏర్పాటు చేసినట్లు కమాండెంట్ తెలిపారు. ఆర్టీఓ ఆఫీస్ జంక్షన్ మీదుగా వెళ్లే వాహనదారులు,స్థానిక ప్రజలు నిలిచి మరీ ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. పోలీస్ సిబ్బంది ప్రతిభను, అమరవీరుల సేవలను కొనియాడుతూ చప్పట్లతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి. వంశీ మోహన్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్ ఈ. వీరన్న ఆర్ఐలు కార్తీక్, వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్,కృష్ణ, ఆర్ఎస్ఐలు శ్రీకాంత్,విక్రమ్ బాబు,సిబ్బంది పాల్గొన్నారు.

మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఏనుగల్ కాంప్లెక్స్ పాఠశాలల ఉపాధ్యాయులు



(వరంగల్/ పర్వతగిరి)అక్టోబర్ 28, ప్రజాకలం ప్రతినిధి:

పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్రంలో మెసెంజర్ (అటెండర్) గా విధులు నిర్వహించిన చందా సారయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. ఏనుగల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరు కలిసి 17000/- రూపాయలను జమ చేసి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ డబ్బులను బుధవారం ఏనుగల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గాయపు లింగారెడ్డి సమక్షంలో సోమారం గ్రామంలో సారయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. సారయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏనుగల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గాయపు లింగారెడ్డి మాట్లాడుతూ సారయ్య అకాల మరణం బాధాకరమని వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతనెక్కొండ హైస్కూల్ హెడ్మాస్టర్ అంజయ్య, ఏనుగల్ పాఠశాల ఉపాధ్యాయులు నరసింహారావు, పీఆర్టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాములు, నాగేశ్వర్ రావు, చింతనెక్కొండ ఏనుగల్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్లు లక్ష్మారెడ్డి, మల్సూరియ, ఉపాధ్యాయులు, భిక్షపతి, సీఆర్పీ లోకేష్, సీఓ జయరాజ్, ఐఈఆర్పి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం

ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్

(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 28, ప్రజాకలం ప్రతినిధి:

పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రైతు వేదిక వద్ద డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సంఘ మిత్ర అను కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వరంగల్ పోలీస్ కమీషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ ఆదేశాల మేరకు వరంగల్ ప్రాంతంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం డ్రగ్స్ నిర్మూలన లో మహిళలను భాగస్వాములను చేయడం సంఘమిత్ర అనగా సమాజానికి మిత్రులు అని మహిళలు సమాజానికి నిజమైన మిత్రులను డ్రగ్స్ నిర్మూలన కోసం మహిళలు నడుం బిగించి ముందుకు నడవాలని సూచించారు. ప్రతి మహిళ కుటుంబంలో ఒక తల్లిగా, కుమార్తెగా, సోదరిలాగ వివిధ పాత్రలు పోషిస్తుంది. వారి ఇంట్లో ఎవరైనా మత్తు పదార్థాల భారిన పడినట్లయితే మహిళలు సులభంగా గుర్తించి చెప్పగలరు అనే ఉద్దేశ్యం తో మహిళలను భాగస్వాములను చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ ఐపీఎస్ డ్రగ్స్ వల్ల జరిగే అనర్థలను వివరించడం జరిగింది. యువతకు డ్రగ్స్ ఎలా అలవాటు అవుతుంది. సరదాగా తీసుకోవడం ప్రారంభించి వాటికి అలవాటు పడి జీవితాలను యువత ఎలా పాడు చేసుకుంటున్నారో ఉదాహరణలతో సహా వివరించడం జరిగింది. డ్రగ్స్ నిర్మూలనలో మహిళలు ప్రధాన పాత్ర నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లు, స్నేహితుల వివరాలు, వారి రోజువారీ ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలి.

గ్రామాలు, పట్టణాల్లో గంజాయి సరఫరా లేదా విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తి రహస్యంగా ఉంచుతారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలను (ఆరోగ్యం, ఆర్థికం, నేరాలు) ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం. పోలీసులకు, సామాన్య ప్రజలకు, మహిళా సంఘాలకు మధ్య సమన్వయాన్ని పెంచి గంజాయి, డ్రగ్స్ రహిత ప్రాంతంగా మార్చాలని చేస్తున్నాము అని అన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్టు తెలిస్తే 112 ద్వారా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వ్యక్తుల వివరాలు గొప్యంగా ఉంటాయని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మామూనూరు ఏసీపి వెంకటేశ్వర్లు, పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్, పర్వతగిరి ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది గ్రామీణ మహిళలు, మహిళ సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మారి సంస్థ ఎన్జీవో ప్రతినిధులు సుమారు 200 మంది వరకు పాల్గొన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిపై సమీక్ష

- రాష్ట్ర మంత్రుల సమక్షంలో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్..

పటాన్ చేరు.అక్టోబర్ 28 (ప్రజా కలం) ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు సంగారెడ్డి జిల్లా



ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో కలిసి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశం ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి సమీక్షలో భాగంగా నిర్వహించగా,రాష్ట్ర మంత్రుల సమక్షంలో జిల్లా స్థాయి అంశాలపై చర్చించేందుకు ప్రజాప్రతినిధులు,సంబంధిత వర్గాలు పాల్గొన్నారు పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కాట శ్రీనివాస్ గౌడ్ ఈ సమావేశానికి హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించే అంశాలపై ఇలాంటి సమీక్ష సమావేశాలు కీలకంగా నిలుస్తాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులతో కలిసి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొనడం రాజకీయంగా, పరిపాలనా పరంగా ప్రాధాన్యం పొందింది..

జాతీయ కుస్తీ జట్టుకు జీఎంఆర్ భరోసా

- సొంత నిధులతో రూ.1.50 లక్షల క్రీడా సామగ్రి, భోజనం, ప్రయాణ ఖర్చులు..

పటాన్‌చెరు, అక్టోబర్ 28 (ప్రజా కలం) ప్రతినిధి

జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో తెలంగాణ జట్టు సత్తా చాటేందుకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. ఢిల్లీలో నవంబర్ 1 నుంచి 5 వరకు జరగనున్న 70వ జాతీయ పాఠశాల క్రీడల కుస్తీ పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొంటున్న అండర్-17 బాలబాలికల జట్లకు తన సొంత



నిధులతో రూ.1.50 లక్షల విలువైన క్రీడా సామగ్రితోపాటు భోజన, ప్రయాణ ఖర్చులను అందించారు.బుధవారం సాయంత్రం పటాన్‌చెరులో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు.స్వతహాగా క్రీడాకారుడైన జీఎంఆర్ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తూ,యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలను నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి శ్రీనివాస్, విద్యాశాఖ మండల అధికారి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీధర్ చారి, మాణిక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, షకీల్, దస్తగిరి, శిక్షకుడు సంగ్రామ్, వ్యాయామ ఉపాధ్యాయుడు గౌసుద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు..

వాల్మీకి ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

- మహనీయుల బోధనలు యువతకు చేరాలి: నీలం మధు..

పటాన్‌చేరు, అక్టోబర్ 28 (ప్రజా కలం) ప్రతినిధి

వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి మార్గదర్శకమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.మహనీయుల జీవిత చరిత్రలను యువతకు పరిచయం చేస్తూ, వారి ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం చాప్టా (కె) గ్రామంలో బుధవారం నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డితో కలిసి నీలం మధు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వాల్మీకి మహర్షి రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని, ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు విగ్రహావిష్కరణలు వేడుకలకే పరిమితం కాకుండా మహనీయుల ఆశయాల సాధనకు ప్రేరణ కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్,గుండు లక్ష్మణ్, గుండు మోహన్, సత్యనారాయణ,కౌన్సిలర్ రామకృష్ణ, సర్పంచులు, నాయకులు, వాల్మీకి సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు..





డెంగ్యూపై గీతం గురి

మెరుగైన టీకాలతో డెంగ్యూకు చెక్.. డాక్టర్ ఫర్హాన్ అహ్మద్..

పటాన్‌చెరు, అక్టోబర్ 28 (ప్రజా కలం) ప్రతినిధి

వాతావరణ మార్పులతో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డెంగ్యూ ముప్పును ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, సామాజిక పరిశోధకులు సమన్వయంతో పనిచేయాలని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్రాల విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ స్పష్టం చేశారు. మెరుగైన టీకాల రూపకల్పనతో ఉష్ణమండల వ్యాధుల నివారణకు మార్గం సుగమం చేయవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ సంస్థాగత పరిశోధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎనిమిదో పరిశోధన సదస్సు నిర్వహించారు. వేడెక్కుతున్న ప్రపంచంలో టీకాల రూపకల్పన:డెంగ్యూపై పోరులో విజ్ఞానం,సమానత్వం, విధానం అనే అంశంపై డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ ప్రసంగించారు వాతావరణ మార్పులు, పర్యావరణ పరిస్థితులు డెంగ్యూ వ్యాప్తిపై చూపుతున్న ప్రభావాన్ని వివరిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి ముప్పు పెరుగుతున్న తీరును వివరించారు.డెంగ్యూ నివారణకు తమ పరిశోధనా బృందం చేపట్టిన టీకా రూపకల్పన ప్రయత్నాలను వెల్లడించారు. ప్రస్తుతం పరిశోధనలు ప్రాథమిక, ప్రయోగపూర్వ దశల్లో ఉన్నప్పటికీ, టీకాల భద్రత, సమర్థతకు సంబంధించిన సవాళ్లను మెరుగైన రూపకల్పన ద్వారా అధిగమించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు పలు సందేహాలను నివృత్తి చేసుకుంటూ పరిశోధన అంశాలపై చర్చించారు. డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ పరిశోధనా నైపుణ్యాన్ని, విషయాలను వివరించిన తీరును ప్రశంసించారు..



కరువు మండలంగా బొమ్మలరామారం,

- తీవ్ర ఆందోళనలో రైతులు,మండల ప్రజలు

- యాదాద్రి జిల్లాను కమ్మేసిన కరువు..17 మండలాలు ప్రభావితం

- తీవ్ర కరువు మండలంగా తుర్కపల్లి గుర్తింపు

బొమ్మలరామారం,అక్టోబర్ 28 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2026 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాలోని మొత్తం 17 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. వీటిలో తుర్కపల్లి మండలాన్ని తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతంగా మరియు బొమ్మలరామారం మండలం మిగిలిన 15 మండలాలను మోస్తరు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది.

ఈ మేరకు ప్రభుత్వం అక్టోబర్ 27న ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కరువు ప్రభావిత మండలాలు ఈ విధంగా ఉన్నాయి1. అడ్డగూడూరు,2. ఆలేరు,3.ఆత్మకూరు (ఎం),4. భువనగిరి, 5.భూదాన్ పోచంపల్లి, 6.బీబీనగర్,7. బొమ్మలరామారం,8. చౌటుప్పల్,9.గుండాల,10. మోటకొండూరు,11. మోత్కూరు,12. నారాయణపూర్,13. రాజాపేట,14. రామన్నపేట,15. తుర్కపల్లి,16. వలిగొండ,17. యాదగిరిగుట్ట ఉన్నాయి కరువు ప్రభావంతో రైతులకు ఊరట కలిగించే చర్యలు ప్రభుత్వం తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది వర్షాభావం,నేలలో తేమ తగ్గడం,భూగర్భ జలాల పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణంలో మార్పులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం కరువు మండలాలను గుర్తించింది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు అవసరమైన సహాయం అందించడం తోపాటు తాగునీటి సరఫరా, పశుగ్రాసం,ఉపాధి హామీ పనుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించింది.వంటలు సాగు చేసేందుకు పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

టాటా ఇంట్రా వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

- ఉప్లూర్ వద్ద ప్రమాదం- కమ్మర్‌పల్లి పోలీసుల కేసు నమోదు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 28:

రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన కమ్మర్‌పల్లి మండల పరిధిలోని ఉప్లూర్ గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్లూర్ గ్రామానికి చెందిన తూర్పాటి రాజన్న (75) ఉపాధి హామీ పనులు ముగించుకుని తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని యాదవ సంఘం వద్దకు చేరుకోగానే, ఉప్లూర్ నుంచి ఏర్గట్ల వైపు వెళ్తున్న టాటా ఇంట్రా వాహనం రాజన్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది.



ఈ ప్రమాదంలో రాజన్న తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భీంగల్ గ్రామానికి చెందిన టాటా ఇంట్రా డ్రైవర్ షేక్ ఆవేష్ (25) అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి భార్య భగీర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమ్మర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధునాతన ఎండోస్కోపీ చికిత్సలకు శిక్షణ కేంద్రం

- ఏఐజీ ఆస్పత్రులు--బోస్టన్ సైంటిఫిక్ మధ్య ఒప్పందం

- మూడేళ్లపాటు వైద్యులకు ప్రత్యేక శిక్షణ

టైర్-2, టైర్-3 నగరాల వైద్యుల నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

హైదరాబాద్, అక్టోబరు 28 (ప్రజా కలం): అధునాతన జీర్ణకోశ వ్యాధుల చికిత్సను మరింత మందికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఏఐజీ ఆస్పత్రులు, బోస్టన్ సైంటిఫిక్ సంస్థలు కీలక ముందడుగు వేశాయి. మినిమల్లీ ఇన్వేసివ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ చికిత్సల కోసం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు మూడేళ్ల సహకార ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశవ్యాప్తంగా వైద్యులకు అధునాతన ఎండోస్కోపీ విధానాల్లో శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

వైద్యులకు ప్రత్యేక శిక్షణ

ఈ ఒప్పందంలో భాగంగా ఏఐజీ ఆస్పత్రులు ప్రతి ఏడాది నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కోలాంజియోప్యాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సీపీ), కోలాంజియోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్), ఎండోలుమినల్ సర్జరీ వంటి అధునాతన వైద్య విధానాలపై శిక్షణ ఇస్తారు. తరగతి గది బోధనతో పాటు ప్రత్యేక నైపుణ్య ప్రయోగశాలలు,



ప్రత్యక్ష అభ్యాసం, చికిత్సా విధానాలను పరిశీలించే అవకాశాలు కల్పిస్తారు. అనుభవజ్ఞులైన వైద్యులు, బయటి నిపుణులు శిక్షణలో పాల్గొంటారు.

చిన్న నగరాల వైద్యులకూ అవకాశం

ప్రధాన నగరాలకే పరిమితమైన అధునాతన చికిత్సా నైపుణ్యాలను ఇతర ప్రాంతాలకు విస్తరించడంపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ముఖ్యంగా టైర్-2, టైర్-3 నగరాల్లో పనిచేసే వైద్యులకు శిక్షణ అవకాశాలు కల్పించనున్నారు. ఎండోస్కోపీ సాంకేతిక నిపుణులు, నర్సింగ్ సిబ్బందికి కూడా శిక్షణ ఇవ్వనున్నారు. డిజిటల్ అభ్యాసం, వైద్య పరిశీలన కార్యక్రమాలు, నిరంతర మార్గదర్శకత్వం ద్వారా వారి నైపుణ్యాలను మెరుగుపరచనున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. అధునాతన చికిత్సలు అవసరమైన రోగులు పెద్ద నగరాలపై మాత్రమే ఆధారపడాల్సిన పరిస్థితి మారాలని పేర్కొన్నారు. చిన్న నగరాలు, పట్టణాల్లో సేవలందించే వైద్యులకు తగిన శిక్షణ, ప్రత్యక్ష అనుభవం, నిరంతర మార్గదర్శకత్వం అందించడం ద్వారా ప్రత్యేక వైద్య సేవలను రోగులకు చేరువ చేయవచ్చని తెలిపారు. బోస్టన్ సైంటిఫిక్ ఎండోస్కోపీ విభాగం వైస్ ప్రెసిడెంట్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రయాన్ డంకిన్ మాట్లాడుతూ.. వైద్య నైపుణ్యం, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల మధ్య సమన్వయం రోగుల సంరక్షణను మెరుగుపరచడంలో కీలకమని చెప్పారు. ఏఐజీ ఆస్పత్రులతో భాగస్వామ్యం ద్వారా వైద్యులకు నిరంతర అభ్యాస అవకాశాలను అందించనున్నట్లు తెలిపారు. బోస్టన్ సైంటిఫిక్ ఏపీఏసీ గ్రోత్ మార్కెట్స్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ మదన్ కృష్ణన్ మాట్లాడుతూ.. వైద్య సాంకేతికతలో పురోగతికి అనుగుణంగా వైద్యుల విద్య, నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా అధునాతన చికిత్సా విధానాలపై అవగాహన పెంచి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ కేంద్రం వార్షిక శిక్షణ ప్రణాళిక, పర్యవేక్షణ విధానాలతో పనిచేయనుంది. కార్యక్రమాల పురోగతిని ప్రతి ఏడాది సమీక్షించి, శిక్షణను మరింత అభివృద్ధి చేసే మార్గాలను గుర్తించనున్నారు. దేశవ్యాప్తంగా అధునాతన జీర్ణకోశ చికిత్సలకు ప్రాప్యతను విస్తరించడంలో ఈ సహకారం దోహదపడుతుందని రెండు సంస్థలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

భారత వికలాంగుల క్రికెట్ జట్టుకు ఎంపికైన సాయినాథ్‌రెడ్డి, చంద్రభాన్‌గిరికి సన్మానం

- జాతీయ జట్టుకు ఎంపిక కావడం గర్వకారణం

- వైకల్యం క్రీడలకు అడ్డంకి కాదని నిరూపించారు: నరేందర్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 28 (ప్రజా కలం): భారత వికలాంగుల క్రికెట్ జట్టుకు ఆటగాడిగా ఎంపికైన సాయినాథ్‌రెడ్డి, కోచ్‌గా ఎంపికైన చంద్రభాన్ గిరిలను తెలంగాణ వికలాంగుల క్రికెట్ నిర్వహణ కమిటీ ఘనంగా సన్మానించింది. వికలాంగుల క్రికెట్ రంగంలో వారు చూపిన ప్రతిభ, సాధించిన విజయాలకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఫతే మైదాన్ క్లబ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీ సహాయ మంత్రి వేణుగోపాలాచారి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ శివసేనా రెడ్డి, కోచ్ జి. మనోహర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై సాయినాథ్‌రెడ్డి, చంద్రభాన్‌గిరిని అభినందించారు.

భారత్--శ్రీలంక టోర్నీకి ఎంపిక

చెన్నై వేదికగా అక్టోబరు 31 నుంచి నవంబరు 2 వరకు భారత్--శ్రీలంక జట్ల మధ్య జరగనున్న వికలాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు భారత జట్టులో సాయినాథ్‌రెడ్డి ఆటగాడిగా, చంద్రభాన్‌గిరి కోచ్‌గా ఎంపికయ్యారు. జాతీయ జట్టుకు ఎంపిక కావడంతో తెలంగాణ వికలాంగుల క్రికెట్ రంగానికి గుర్తింపు లభించిందని నిర్వాహకులు తెలిపారు.

యువతకు స్ఫూర్తి

తెలంగాణ వికలాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. భారత జట్టుకు సాయినాథ్‌రెడ్డి, చంద్రభాన్‌గిరి ఎంపిక కావడం వారి కుటుంబాలతో పాటు తెలంగాణలోని వికలాంగ క్రికెట్ వర్గానికి గర్వకారణమన్నారు. శారీరక వైకల్యం క్రీడల్లో రాణించడానికి అడ్డంకి కాదని వారి విజయాలు నిరూపించాయని పేర్కొన్నారు. వికలాంగ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా మరింత మంది దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వారి ప్రతిభను గుర్తించి తగిన అవకాశాలు, ప్రోత్సాహం, సహకారం అందిస్తే మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. సాయినాథ్‌రెడ్డి, చంద్రభాన్ గిరిల ప్రస్థానం దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



365 మండలాల్లో కరువు ఛాయలు

- ప్రత్యేక నిధులు కేటాయించాలి
- ధరావత్ చంద్ర భాను నాయక్

బీబీనగర్, అక్టోబర్ 28 (ప్రజాకలం): తెలంగాణలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి ధరావత్ చంద్ర భాను నాయక్ బుధవారం విలేకర్ల సమావేశంలో అన్నారు. అక్టోబరు 24న రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసిన జీఓ నంబరు 3 ప్రకారం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 31 జిల్లాలకు చెందిన 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 612 మండలాల్లో దాదాపు 60 శాతం మండలాలు కరువు ప్రభావానికి గురికావడం ఆందోళనకరమన్నారు. కరువు ప్రభావం వ్యవసాయంతోపాటు తాగునీటి సరఫరా, పశుసంపద, గ్రామీణ ఉపాధి, రోజువారీ కూలీల జీవనోపాధిపై పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఉపశమన చర్యలు చేపట్టాలని, ప్రజలకు తాగునీరు, పశువులకు మేత, నీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, దీర్ఘకాలిక నివారణ ప్రణాళికను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



భక్తిశ్రద్ధలతో శబరిమలకు అయ్యప్ప స్వాముల మహాపాదయాత్ర

ఇరుముడులతో 1,600 కిలోమీటర్ల కాలినడక ప్రయాణం ప్రారంభం

మెదక్, అక్టోబర్ 28 (ప్రజాకలం ప్రతినిధి) మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి శబరిమలకు అయ్యప్ప స్వాముల మహాపాదయాత్ర బుధవారం ఉదయం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. హరిదాస్ గురుస్వామి, రాజు పంతులు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు ధరించిన అయ్యప్ప స్వాములు సుమారు



1,600 కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన ప్రయాణించేందుకు బయలుదేరారు. ఈ పాదయాత్రలో వర్షిత్, నరేష్, ఉప్పల శ్రీను, చంద్రశేఖర్, శివుడు, సంగమేశ్వర్, రామ్డిన్, రమేష్, సాయి కృష్ణ తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు భజనలు చేస్తూ, అయ్యప్ప నామస్మరణతో ముందుకు సాగుతూ పట్టణం చివరి వరకు పాదయాత్ర కొనసాగించారు. స్వామివారి దర్శనం లక్ష్యంగా భక్తితో ప్రారంభమైన ఈ యాత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త సమాజ సభ్యులు గంగా లక్ష్మిపతి, మేడిశెట్టి వీరుకుమార్, కొండ శ్రీనివాస్, రాజన్ చక్రపాణి, పురం వెంకటనారాయణ, పార్శి శ్రీధర్, గుండు రమేష్, బచ్చు పార్థివనాథ్ తదితర అయ్యప్ప భక్తులు పాల్గొని స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు.

రోస్టర్ పాయింట్ సవరించే వరకు ఉద్యమిస్తాం

మాలల జేఏసీ చైర్మన్ ఆస లక్ష్మణ్.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 28.

మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు న్యాయం జరిగేలా రోస్టర్ పాయింట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సవరించాలని మాల జేఏసీ జిల్లా




చైర్మన్ ఆస లక్ష్మణ్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. ఈ నెల 5న భూంపల్లి, అక్బర్‌పేట మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గ మాలల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం రాయపోల్ అంబేడ్కర్ చౌరస్తాలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. రోస్టర్ పాయింట్ 22 నుంచి 10లోపు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది కాలంగా ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ కారణంగా మాలలు అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో ఉద్యమబాట పట్టాల్సి వస్తోందన్నారు. రోస్టర్ పాయింట్‌ను సవరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆస బాబు, జక్కుల రాజు, పల్లెటూరు ప్రసాద్, పుట్ట రాజు, సోక్కం స్వామి, దాతార్‌పల్లి భాస్కర్, తూర్పు శ్రావణ్, తూర్పు లక్ష్మణ్, దాసరి బాల్ నర్స్, లింగం, స్వామి, కరుణాకర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో జూపిటర్ వెంచర్ ల్యాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రఫ్ స్టోన్ & రోడ్డు మెటల్ క్వారీ పై

ప్రజా అభిప్రాయ సేకరణ

- గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 72 లో రఫ్ స్టోన్ మరియు రోడ్డు మెటల్ క్వారీ నిర్వహించుటకు గ్రామ ప్రజల మద్దతు



బొమ్మలరామారం, అక్టోబర్ 28 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, తిరుమలగిరి గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 72లో జూపిటర్ వెంచర్ ల్యాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (క్రషర్ కంపెనీ) పది హెక్టార్లలో రఫ్ స్టోన్ మరియు రోడ్ మెటల్ క్వారీ నిర్వహించుటకు తెలంగాణ కాలుష్య నియంత్రమండలి నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ అంశంపై మంగళవారం రోజున బీబీనగర్ మండలం, కొండమడుగు గ్రామ రెవిన్యూ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నల్గొండ జిల్లా పిసిబి ఆధ్వర్యంలో నిర్వహించగా కార్యక్రమానికి భువనగిరి ఆర్డిఓ కృష్ణారెడ్డి,జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా సంబంధిత భూముల అంశంపై స్థానిక ప్రజల నుండి మరియు ప్రజాప్రతిని ధులు,ఎన్జీవోల నుండి అభిప్రాయాలను సేకరించారు. కంపెనీ ప్రతిపాదనలకు సంబంధించి తిరుమలగిరి గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, గ్రామ ప్రజలు,ఎన్జీవోలు జుపిటర్ లాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించే క్రషర్ కంపెనీకి మద్దతు తెలిపారు ఈ సందర్భంగా తిరుమలగిరి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సంబంధించిన విషయంలో పూర్తి సహకారం అందించాలని కోరారు గ్రామం నుండి వెళ్లే విద్యార్థి విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే క్రషర్ యజమాన్యం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల ఇన్స్పెక్టర్ కొండం వెంకట్ రెడ్డి,మైనింగ్ అధికారులు,పోలీసు అధికారులు,తిరుమలగిరి గ్రామ సర్పంచ్ బానోతు కవిత కుమార్,ఉప సర్పంచ్ ప్రీతి, పాలకవర్గం సభ్యులు, మాజీ సర్పంచ్ బైరగోని శ్రీనివాస్ గౌడ్, స్వామి,రాజు నాయక్, మాజీ ఉపసర్పంచ్ శేఖర్,సుభాష్, లాల్ సింగ్,నవీన్,కిషన్, నుధాకర్, మురళి,పకీర, భాస్కర్,నెర్రూ,గణేష్, రమేష్, ఇస్మాయిల్, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.



భట్టుగూడెంలో రైతు అవగాహన సదస్సు

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలి



బీబీనగర్, అక్టోబర్ 28 (ప్రజాకలం): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని అడ్వాంట సీడ్స్ కంపెనీ భువనగిరి డివిజన్ ఇన్‌చార్జి నరేష్ యాదవ్ సూచించారు. బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ దాసమోని వెంకటేష్, సర్పంచ్ దాసమోని లతా శ్రీశైలం ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు రైతు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా నరేష్ యాదవ్ మాట్లాడుతూ.. వరి సాగులో విత్తనాల ఎంపికతోపాటు పంట యాజమాన్య పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. రానున్న రోజుల్లో అందుబాటులోకి రానున్న నూతన వరి వంగడాల గురించి వివరించారు. పంట దిగుబడి పెంచేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. అనంతరం మాజీ ఎంపీటీసీ దాసమోని వెంకటేష్, సర్పంచ్ లతా శ్రీశైలం తమ వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన వరి పంటను రైతులకు చూపించారు. అడ్వాంట సీడ్స్ విత్తనాలతో సాగు చేసిన పంటలో కాండాలు వంగకుండా ఉండటంతోపాటు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని వారు పేర్కొన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి సాగు పద్ధతులపై వివరాలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు రైతులను శాలువాలతో సన్మానించారు. రసాల పోచయ్య, గండేయ, సత్తయ్య, దాసమోని సత్తయ్య, దాసమోని కిషన్, నరసింహ, గడగోట్ల సత్తయ్య, శంకరయ్య, బొల్లెమోని భద్రయ్య, నోముల రాములు, బసవరాజ్, కృష్ణమూర్తి, కాసుల మహేందర్, పొలమాని రాజు, వి.రామాంజనేయులు, ఎం.మధు, డి.సుధాకర్, కె.కృష్ణ, ఎం.శ్రీకాంత్, ఎం.భూపాల్, పి.బాలి, దయాకర్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి - శేరి సతీష్ రెడ్డి



కూకట్‌పల్లి, అక్టోబర్ 28, ప్రజా కలం ప్రతినిధి:

కేపీహెచ్ బి కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్లియా క్లినిక్ అండ్ ఫార్మసీని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్య రంగంలో సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు కి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

శంషాబాద్ ను కరువు మండలంగా ప్రకటించడం హర్షణీయం

- రైతులకు ఎంతో ఉపశమనం కలిగింది
- నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపిన శ్రీకాంత్ గౌడ్

రాజేంద్రనగర్, అక్టోబర్ 28,(ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్ అన్నారు.కరువు మండలాల జాబితాలో



శంషాబాద్ మండలానికి చోటు దక్కడం పట్ల రైతులకు ఎంతో ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అనేగౌని శ్రీకాంత్ గౌడ్ స్థానిక ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్ కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని,క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి శంషాబాద్ ను కరువు మండలంగా ప్రకటించడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ఎల్‌నినో ప్రభావంతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఈ దుర్భర పరిస్థితులను తట్టుకునేందుకు ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడం అభినందనీయమని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.కరువు మండలంగా గుర్తింపు లభించడంతో రైతులకు ప్రభుత్వం నుంచి లభించే సహాయక చర్యలు,ఉపశమన కార్యక్రమాలకు మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కరువు మండలంగా శంషాబాద్ ను ప్రకటించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

ఎమ్మెల్సీగా డాక్టర్ జంపాల రాజేష్ కు

అవకాశం ఇవ్వాలి

ఎంహెచ్ పీఎస్ ప్రధాన కార్యదర్శి రాంబాబు డిమాండ్

మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం):

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా విద్యార్థి నాయకుడిగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన డాక్టర్ జంపాల రాజేష్ కు కాంగ్రెస్ పార్టీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని మంగలి హక్కుల పోరాట సమితి (ఎంహెచ్ పీఎస్) ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి రాంబాబు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ జంపాల రాజేష్ విద్యార్థి నాయకుడిగా ఉంటూనే విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కాకుండా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు, అణగారిన బహుజనుల కోసం నిరంతరం అనేక ఉద్యమాలు చేసిన నాయకుడని కొనియాడారు.అత్యంత వెనుకబాటుకు గురైన ఎంబీసీ కులానికి చెందిన రాజేష్, న్యాయ శాస్త్రంలో పీహెచ్.డీ అభ్యసించిన ఉన్నత విద్యావంతుడని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 242 కులాలలో మొదటి 20 లోపు జనాభా కలిగిన వినాయి బ్రాహ్మణ కులానికి చెందిన రాజేష్ కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం సముచితంగా ఉంటుందన్నారు.ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా నాయి బ్రాహ్మణులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాజేష్ కు గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి, యావత్ నాయి బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అక్కున చేర్చుకోవాలని విన్నవించారు.కాంగ్రెస్ అధిష్టానం రాజేష్ సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయి బ్రాహ్మణుల తరపున రాజీ లేని కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



అప్పుల బాధతో యువకుడి మృతి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 28.

ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన రాంసాగర్ గ్రామానికి చెందిన కల్లూరి యాదగిరి (32) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం.. యాదగిరి మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రూ.5 లక్షల రుణం తీసుకున్నాడు.



ఇంటి ఖర్చుల కోసం మరికొంత అప్పు చేశాడు. అప్పుల వాయిదాలు చెల్లించలేక గత కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటికి వచ్చిన అతడు అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అనంతరం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స అందించారు. వైద్యులు గడ్డిమందు తాగినట్లు గుర్తించారు.

మెరుగైన వైద్యం కోసం ఈ నెల 17న పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ బి.లింగం తెలిపారు.



కుకునూరు ఉన్నత పాఠశాలలో

ఘనంగా 'ఈ-వేస్ట్' కార్యక్రమం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 28:

వేల్పూర్ మండల పరిధిలోని కుకునూరు ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈ-వేస్ట్' (ఎలక్ట్రానిక్ వ్యర్థాల) నిర్మూలన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హరిచరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు తమ ఇళ్లలో వృథాగా పడి ఉన్న, పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను పాఠశాలకు తీసుకువచ్చారు. వీటి



కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలలో వాటిని భద్రపరిచారు. ముఖ్యంగా పాడైపోయిన సెల్ ఫోన్లు, చార్జర్లు, పాత బ్యాటరీలు, టీవీ రిమోట్ కంట్రోళ్లను విద్యార్థులు పెద్ద ఎత్తున సేకరించారు. వీటితో పాటు తడి, పొడి చెత్తతో వృథాగా ఉన్న గడువు ముగిసిన (ఎక్స్పైరీ డేట్) ఔషధ బిళ్ళలను (టాబ్లెట్లు) కూడా ఆయా డబ్బాలలో వేసి పారేసే విధానంపై అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే ఎలక్ట్రానిక్ వ్యర్థాల నియంత్రణకు నడుం బిగించిన విద్యార్థులను, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రధానోపాధ్యాయులు హరిచరణ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ పతాని గంగాధర్, శ్రీధర్ రావు, నాగరాజు, రవీందర్, మల్లన్నా, చరణ్ దాస్, హరిత, అశోక్ మరియు సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ సుంకెట్‌లో విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 28:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ సుంకెట్



ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు నవీన్, మనోజ్ పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణను అలవర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఇలాంటి ప్రేరణాత్మక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి భవిష్యత్తుకు సరైన దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు.



అంబేడ్కర్ గడ్డపై అంబేడ్కరైట్లపైనే దాడులా ?

- ప్రశ్నించిన ఆందోళనకారులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 28:

ఆల్ ఇండియా ఇండిపెండెంట్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముంబై ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఇందులో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ రణదీవే, ప్రధాన కార్యదర్శి దీపాలి సాల్వే, సాయిల్ తండ్రి రాజేంద్ర వాకోడే, దిల్లీ నుంచి అశుతోష్ విద్రోహి, శ్రీపాద్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాహిల్ జ్ఞాపకార్థం అక్టోబర్ 25న నిర్వహించిన క్యాండిల్ మార్చ్ కోసం అంబేడ్కర్ సమాధిఐన చైత్యభూమికి ప్రవేశాన్ని పరిమితం చేయడం సరైన చర్య కాదని, పోలీసులు చైత్యభూమిని రణభూమిగా మార్చారని అసోసియేషన్ ఆరోపించింది. తమ 14మంది కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ విధించారని, అందులో ప్రశాంత్ పై నమోదైన ఎఫ్ఐఆర్ ను తక్షణమే రద్దు చేయాలని, దీపాలి గృహ నిర్బంధంపై పారదర్శకతను కోరుతున్నామన్నారు. రాజేంద్ర మాట్లాడుతూ తన కుమారుడు సాహిల్ తో ప్రొఫెసర్లు మొదటి అంతస్తుపై జరిపిన చర్చల సీసీ ఫుటేజ్ ఏమైందని ప్రశ్నించారు. సాక్ష్యాలను కనుమర్గు చేస్తున్నారని, డైరెక్టర్ కెదారే, ప్రొఫెసర్ డూల్లాను సస్పెండ్ చేసి, వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అశుతోష్ మాట్లాడుతూ మన రాజకీయ దళిత నాయకులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. ఐతే ఉన్నత విద్య సంస్థల్లో కుల వివక్ష, సంస్థాగత వేధింపులను ఎదుర్కోవడానికి "రోహిత్ చట్టాన్ని" అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్ని డిమాండ్ చేశారు.

టపాసుల దుకాణాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: నిజామాబాద్ పోలీస్ కమిషనర్



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 28:

దీపావళి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పే వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి (ఏసీపీ) కార్యాలయం నుండి అనుమతి పొందాలని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారాలను ఆయా ఏసీపీ కార్యాలయాల్లో సమర్పించి, అనుమతి పత్రాలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ముందస్తు అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు - 1884, రూల్స్ 1933 (సవరణ 2008) ప్రకారంగా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

దుకాణాదారులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలు:

స్థల అనుమతి: టపాకాయల దుకాణాలను కేవలం మైదానాలు, ఖాళీ ప్రదేశాలలో మాత్రమే ఏర్పాటు చేయాలి. ఆ స్థలానికి సంబంధించిన ఎన్.ఓ.సి (చీజు) సర్టిఫికేటును దరఖాస్తుతో పాటు తప్పకుండా జతపరచాలి.

షాపుల పరిమితి: ఒక క్లస్టర్ పరిధిలో దుకాణాల సంఖ్య 50కి మించకూడదు.

నిషేధిత ప్రాంతాలు: జనరద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఎలాంటి బాణసంచా దుకాణాలకు అనుమతి లేదు. అలాగే కళ్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు, సమావేశ మందిరాల ఆవరణలో దుకాణాలు నెలకొల్పరాదు.

అగ్నిమాపక జాగ్రత్తలు: తాత్కాలిక దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఫైర్ సేఫ్టీ నిబంధనల ప్రకారం అన్ని రకాల రక్షణ జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇతర అదనపు సమాచారం కోసం వ్యాపారులు తమ పరిధిలోని డివిజినల్ స్థాయి పోలీస్ అధికారులను సంప్రదించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన సీపీ సాయిచైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 28:

జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సీపీ ఎస్టీ కమిషన్ సభ్యుడికి పువ్వుల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.



బాచుపల్లి లోని జల్సా జంక్షన్ రెస్టారెంట్ ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి


ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన జల్సా జంక్షన్ రెస్టారెంట్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో యువత ముందుకు సాగడం శుభ పరిణామన్నారు. ఈకార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ మాధవ్ రెడ్డి, డిసిసి సెక్రెటరీ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బొల్లెపల్లి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- నిలిచిన సాగునీరు
పంటలు ఎండిపోయే ప్రమాదం..
స్పందించాలని సర్పంచ్ వినతి

బీబీనగర్, అక్టోబరు 28 (ప్రజాకలం): కాలువలో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో మాదారం గ్రామ రైతులకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మీటి తండా సమీపంలోని బొల్లేపల్లి కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరు ముందుకు సాగడం లేదు. అధికారులు వెంటనే స్పందించకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా మాదారం గ్రామ సర్పంచ్ మందడి వెంకట్‌రెడ్డి బుధవారం రైతులతో కలిసి కాలువను పరిశీలించారు. పూడికతో నీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డంకులను, సాగునీరు అందక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాలువలో పూడిక, చెత్తాచెదారం తొలగించకపోవడంతో గ్రామానికి సాగునీరు అందడం లేదన్నారు. సమస్యను ఇప్పటికే నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి పంటలకు సాగునీరు అందించాలని కోరారు. ఆలస్యం జరిగితే రైతులు పంట నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కాలువ నిర్వహణపై అధికారులు దృష్టి సారించి, సాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ కిష్టయ్య, పంజాల సంతోష్‌కుమార్ గౌడ్, రాసాల ఆంజనేయులు, బానోతు పాండు నాయక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

-టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

-మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ఘనంగా ఐఎఫ్ డబ్ల్యూజే వ్యవస్థాపక వేడుకలు



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

జర్నలిస్టుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టం తీసుకురావాలి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేసన్ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని బాబు జగ్జవన్ రాం, అంబేద్కర్ భవన్ లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే)76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పలువురు సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టుల జాతీయ రిజిస్టర్ అమలు చెయ్యాలని, సీనియర్ పాత్రికేయుల కోసం జాతీయ పెన్షన్ పథకం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఢిల్లీతో సహా అన్ని రాష్ట్రాల్లో ఐఎఫ్ డబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని, దీని అనుబంధ సంఘమైన టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే సంఘం ఏర్పడి 76 సంవత్సరాలు అవుతుందని, 1950లో కొందరు సీనియర్ జర్నలిస్టులతో ఏర్పడిన ఈ సంఘం దేశంలోనే మొట్టమొదటి జర్నలిస్టు సంఘం అని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీష్, టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు హత్యలు అక్రమ కేసులు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టి జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల జాతీయ రిజిస్టర్ దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడానికి అన్ని మీడియా సంస్థల్లో వెరిఫికేషన్ నిర్వహించే జాతీయ రిజిస్టర్ చేయాలన్నారు జాతీయ పెన్షన్ పథకం పథకం దేశవ్యాప్తంగా 60 ఏళ్లు పైబడిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించేందుకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని జర్నలిస్టు రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంతో మంది జర్నలిస్టులు సొంత ఇండ్లు లేక అద్దె భవనాల్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని జర్నలిస్టులకు ఇచ్చిన హామీల్లో భాగమైన ఇండ్ల స్థలాలు ఇండ్లు పూర్తిస్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగరాజ్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాయకులు పి.శంకర్, కావలి మోహన్, టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ ప్రధాన కార్యదర్శి ఏ గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, కూకట్పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు యాకన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి

- పెట్రోల్ బంక్ అనుమతులకు లంచం డిమాండ్ చేసిన వెంకటేశ్వర్లు

- 20,000 రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జిల్లా అధికారి



యాదాద్రి అక్టోబర్ 28 ప్రజాకలం:

భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ అధికారుల మెరుపు దాడులలో లంచం తీసుకుంటూ లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఏసీబీ వలలో చిక్కారు.బాధితుడు చింతల యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.

పెట్రోల్ బంకు అనుమతులకు సంబంధించి లీగల్ మెట్రాలజీ శాఖ నుంచి క్లియరెన్స్ కోసం బాధితుడు, అధికారి వెంకటేశ్వర్లు వద్దకు వెళ్లగా.పెట్రోల్ బంకు అనుమతులకు సంబంధించిన పనిని పూర్తి చేసేందుకు ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది.ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.20,000 ముట్టజెప్పాలని తేల్చిచెప్పారు.దీంతో లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు పక్కావ్యూహం రచించిన ఏసీబీ బృందం బాధితుడి నుంచి వెంకటేశ్వర్లు రూ.20 వేల నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.జిల్లా కలెక్టరేట్లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేయడంతో, లంచం తీసుకుంటున్న అధికారిని పట్టుకోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి

- ముఖ్యఅతిథిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్

- మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కెఎల్ఆర్





మహేశ్వరం, అక్టోబర్ 28, (ప్రజా కలం):

హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ పిలుపునిచ్చారు..మహేశ్వరం మండ లం, జీహెచ్ఎంసీ పరిధి తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం అసెంబ్లీ ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని, అందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు నిరంతరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

ముఖ్యం గా మహేశ్వరం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ అందించి, నియోజకవర్గం పార్టీకి కంచుకోట అని నిరూపించాలని వారు కోరారు.ఎమ్మెల్సీ ఓటు నమోదు దరఖాస్తు ప్రక్రియ చివరి తేదీ నవంబర్ 6వ తేదీ వరకే ఉన్నందున, నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులను గుర్తించి, వారిచే ఓటు నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో పట్టభద్రులను కలిసి చైతన్యపరచాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి, టీపీసీసీ సెక్రటరీ అమరేందర్ రెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, కందుకూరు మండల అధ్యక్షుడు రాణా ప్రతాప్ రెడ్డి, మహేశ్వరం మండల అధ్యక్షుడు వట్టెలా మల్లేష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు కాకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పాలిట శాపంగా

"సుభీషి" రియల్ ఎస్టేట్ సూచిక బోర్డులు

రహదారికి ఆనుకొని ఏర్పాటుతో వాహనదారుల తీవ్ర ఇబ్బందులు



తొలగించాలని ప్రజల డిమాండ్

మహేశ్వరం, అక్టోబర్ 28, (ప్రజా కలం ప్రతినిధి)

మహేశ్వరం మండలంలో "సుభీషి" రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. వివరాల్లోకి వెళితే.. మహేశ్వరం మండల రెవెన్యూ ప్రాంతాల్లో సుభీషి రియల్ ఎస్టేట్ సంస్థ భారీగా విల్లా ప్రాజెక్టులు చేపడుతూ, కొనుగోలుదారులను ఆకర్షించేందుకు మహేశ్వరం గేటు నుండి మహేశ్వరం పట్టణం, మాన్సాన్ పల్లి, అమీర్ పేట, దుబ్బచర్ల, తుప్పర్ తదితర ప్రాంతాల వరకు ప్రధాన రహదారికి ఆనుకొని ఎక్కడపడితే అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసింది.

ఈ బోర్డుల కారణంగా రోడ్లు కుచించుకుపోయి, ఒకే సమయంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే పక్కకు తప్పుకోవడానికి కూడా వీలు లేకుండా పోయిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ బోర్డులు ప్రమాదాలకు కారణమవుతున్నా యని, ఇప్పటికే పలు చోట్ల చిన్నపాటి ప్రమాదాలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కావున ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి, తక్షణమే సుభీషి రియల్ ఎస్టేట్ యాజమాన్యం అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణం సాగేలా చూడాలని మహేశ్వరం మండల ప్రజలు కోరుతున్నారు.

మహేశ్వరం ఆర్ అండ్ బి అధికారి భరత్

ఈ విషయంపై మహేశ్వరం ఆర్ అండ్ బీ అధికారి భరత్ గారిని వివరణ కోరగా ఆయన స్పందిస్తూ "రహదారులపై ప్రజలకు ఇబ్బంది కలిగేలా బోర్డులు ఏర్పాటు చేస్తే కచ్చితంగా తొలగిస్తాం.

త్వరలోనే సూచిక బోర్డులను పరిశీలించి, సంబంధిత యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తాం. రహదారి వెంబడి బోర్డులు ఏర్పాటు చేసుకునే క్రమంలో తప్పనిసరిగా ఆర్ అండ్ బీ అధికారుల అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బోర్డులు ఏర్పాటు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకొని తొలగిస్తామని" హెచ్చరించారు.



మంత్రుల్లో పొంగులేటి ప్రథముడు

పేదల కోసం నిరంతరం పనిచేస్తున్నప్రజానాయకుడు: పిడమర్తి రవి

హైదరాబాద్, అక్టోబరు 28 (ప్రజా కలం): మంత్రుల్లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రథముడని, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రజానాయకుడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో మేలుకోటి పార్కు సమీపంలో బుధవారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ.. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తున్నారని కొనియాడారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, రైతు నేస్తం వంటి పథకాలను ప్రారంభించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నూతన తెలంగాణ నిర్మాణంలో ఇటువంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు 'లాంగ్ లివ్ పొంగులేటి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోరెల్లి సురేష్, నక్క మహేష్, ఎండీ రహీం, చైతన్య, జోగు గణేష్, దేవరకొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



స్ట్రీట్ లైట్ల సమస్యకు పరిష్కారం

స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జీడీ సంపత్ గౌడ్

మల్కాజిగిరి, అక్టోబరు 28 (ప్రజా కలం ప్రతినిధి):

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని బాల సరస్వతి నగర్, నరసింహారెడ్డి నగర్ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడీ సంపత్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత వీధి దీపాల విభాగం డీఈ, ఏఈలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీడీ సంపత్ గౌడ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ముందుండి కృషి చేస్తున్నామని తెలిపారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో డివిజన్‌తో పాటు నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మనోహర్, యాదగిరి గౌడ్,మహేష్, రామచందర్,పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన

బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణకు చట్టాలపై అవగాహన అవసరం

మల్కాజిగిరి, అక్టోబరు 28 (ప్రజా కలం ప్రతినిధి): బాలలపై లైంగిక నేరాలను అరికట్టడంతో పాటు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో మల్కాజిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు, బాలికలు)లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆశా లత, మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయ్ కుమార్, ప్రభుత్వ న్యాయవాదులు పాల్గొని విద్యార్థులకు చట్టంలోని ముఖ్యమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం ప్రాధాన్యత, బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన నేరాలు, వాటి నుంచి రక్షణ పొందేందుకు చట్టం కల్పిస్తున్న హక్కులు, నేరాలకు పాల్పడిన వారిపై తీసుకునే చట్టపరమైన చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఆపద ఎదురైనప్పుడు ధైర్యంగా స్పందించాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాలల భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, సురక్షిత వాతావరణం కల్పించేందుకు దోహదపడతాయని తెలిపారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com